VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం, 30.08.2026
సంపుటి : 09 సంచిక : 82 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH www.velthuru.com

## మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

### ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎంతో మారిషస్ బృందం భేటీ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 4

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం..

- ఏడాదిలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే
- వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌బుక్స్
- భూ భారతి ద్వారా తాతల కాలం నాటి భూ సమస్యలకు పరిష్కారం
- నూతన్‌కల్‌లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ
- రైతుల భూ హక్కులకు పూర్తి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వెలుతురు హైదరాబాద్ / సూర్యాపేట ఆగస్టు 29:**
రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని, రానున్న ఏడాది కాలంలో వివాదరహిత భూముల ప్రతి అంగుళాన్ని సమగ్రంగా సర్వే చేసి, అర్హులైన నిజమైన భూ ఆసాములకు పట్టాదారు పాస్‌బుక్స్ అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శనివారం సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రంలో నూతన్‌కల్, మద్దిరాల మండలాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ 15 గ్రామాలకు చెందిన 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాదారు పాస్‌బుక్స్‌ను మంత్రి గారు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి గారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు.

▶ మిగతా 2లో

## రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా సమగ్ర విత్తన చట్టం తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం

- కేంద్రం చట్టం తీసుకొచ్చినా.. తీసుకు రాకపోయినా రాష్ట్రంలో కొత్త విత్తన చట్టం పైముందుకు వెళ్లాలని అధికారులకు ఆదేశాలు
- డ్రాఫ్ట్ విత్తన చట్టం-2025పై మంత్రి తుమ్మల సమీక్ష
- రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ సూచనల ఆధారంగా ఇప్పటికే సమగ్ర చట్టం రూప కల్పన
- డ్రాఫ్ట్ బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపాలి
- కేంద్రం ప్రతిపాదించిన కొత్త చట్టం అమలులో తీవ్ర జాప్యం.
- నకిలీ, నాసిరకం విత్తనాలతో నష్టపోయే రైతులకు పరిహారం అందేలా వచ్చే పంట కాలం నుండి



చట్టబద్ధమైన వ్యవస్థ తీసుకొస్తాము*

- విత్తన ఉత్పత్తి రైతులకు న్యాయం, నాణ్యమైన విత్తనాల సరఫరాకు పటిష్టమైన నియంత్రణ వ్యవస్థ తెస్తాము

2

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**
తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావడంలో ఇక ఎలాంటి జాప్యం ఉండకూడదని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## ప్రాణహితకు పునరుజ్జీవం.. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల బ్యారేజీకి తెలంగాణ పట్టు

- సెప్టెంబర్ 1న ఢిల్లీలో తెలంగాణ– మహారాష్ట్ర కీలక అంతర్రాష్ట్ర చర్చలు
- సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల జల సంప్రదింపులు
- 152 మీటర్ల ఎత్తు సాధ్యమైతే గురుత్వాకర్షణతో సుందిళ్లకు దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలు
- భారీ ఎత్తిపోతల భారం తగ్గించి.. విద్యుత్ వ్యయానికి కళ్లెం వేసే దిశగా అడుగులు
- ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డిలో కోల్పోయిన ఆయకట్టుకు తిరిగి జలభరోసా
- రాష్ట్ర జల ప్రయోజనాల పరిరక్షణలో



రాజీ లేదు: మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 12

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 29:**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుజ్జీవింపజేసి, అసలు పథకంలో తెలంగాణ రైతాంగానికి ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు

## SIRపై ఈసీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

- క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును పొడిగించాలని వినతి
- సెప్టెంబర్ 16 వరకు ఉన్న గడువును..మరికొన్ని వారాలు పొడిగించాలని కోరిన సీఎం
- తుది ఓటర్ల జాబితా గడువునూ పొడిగించాలని విజ్ఞప్తి
- 73.39 లక్షల



ఎంట్రీలు ASDD కేటగిరీలో ఉన్నాయి

- తాత్కాలికంగా వెళ్లిన వారిని కూడా.. శాశ్వతంగా తరలివెళ్లినట్టు పరిగణించే అవకాశం ఉందన్న సీఎం

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:

12

## మక్తల్ అభివృద్ధికి ‘శ్రీహరి మార్క్’ సమీక్ష

- ప్రతి గ్రామానికి 30 నిమిషాల సమయం .. సమస్యలపై లోతైన చర్చ
- SIRతో పాటు గ్రామాల వారీగా అభివృద్ధి ప్రణాళికపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక దృష్టి

**మక్తల్ వెలుతురు ఆగస్టు 29:**
మక్తల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యత కల్పిస్తూ మంత్రి



2

వాకిటి శ్రీహరి ముందుకు సాగుతున్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**
మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్‌మనన్ పెంతియా శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.



11

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు
- సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు.. పీపీపీ విధానంలో అభివృద్ధి
- పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం: మంత్రి జూపల్లి



2

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 29:**
తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు.

## ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

- ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయండి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహకు మంత్రి సీతక్క విజ్ఞప్తి



- సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర

2

హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 29:

## చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి గారి పర్యటన - అభివృద్ధి పనుల పరిశీలన: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

- వికారాబాద్, తాండూర్ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- రూపుదిద్దుకుంటున్న మన్నెగూడ-బీజాపూర్ హైవే పనులు.. మరో 6 నెలల్లో పూర్తి
- నియోజకవర్గంలో 90 శాతానికి పైగా రోడ్లు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణం



- రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై సమన్వయంతో బీజేపీ ప్రజా పోరాటాలు

2

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:

## రేవంత్ సర్కార్‌పై ఉద్యమాలకు బీజేపీ కార్యచరణ

- 22ఏ నిబంధనల ఉపసంహరణకై సెప్టెంబర్ 5, 6 తేదీల్లో మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్ష

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**
రాష్ట్రంలో ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వ మొండి వైఖరిని తీవ్రంగా ఎండగడుతూ, భవిష్యత్ ఉద్యమాలను మరింత ఉధృతం చేసేందుకు భారతీయ జనతా పార్టీ సమాయత్తమైంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు అధ్యక్షతన ఈరోజు జరిగిన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక సమావేశంలో శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయాలని ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పార్టీ నాయకత్వం నిర్ణయించింది.ముఖ్యంగా, రాష్ట్రంలో ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న 22ఏ భూముల నిబంధనలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సమావేశంలో బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ నిర్ణయానికి



వ్యతిరేకంగా సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రెండు రోజుల పాటు అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.

## దశాబ్దాల భూ సమస్యకు పరిష్కారం..

### రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**సూర్యాపేట జిల్లా వెలుతురు ఆగస్టు 29:**
సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నూతన్‌కల్‌లో నూతన్‌కల్, మద్దిరాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 9 గ్రామాల భూ సమస్యకు పరిష్కారం చూపించి రైతులకు పట్టాలు



అందించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. భూమి పట్టాతో రైతుకు హక్కు, ఇందిరమ్మ ఇంటితో కుటుంబానికి ఆత్మగౌరవం కలుగుతుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.

2

# దశాబ్దాల భూ సమస్యకు పరిష్కారం.. రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, కేంద్రం నుంచి నిధులు వచ్చినా రాకపోయినా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గుడిసె లేని తెలంగాణే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలతో ప్రజా ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, రైతు భరోసా కింద వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నారు.అప్పుల భారం ఉన్నప్పటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, ఇళ్లు, మౌలిక వసతుల అభివృద్ధిని ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. HAM విధానంలో రూ.36 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీ మందుల సామేల్,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి గారి పర్యటన - అభివృద్ధి పనుల పరిశీలన: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల, వికారాబాద్, తాండూర్ ప్రాంతాల్లో ఆదివారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారు విస్తృతంగా పర్యటించనున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ పర్యటనలో ఆయన స్వయంగా కేంద్ర మంత్రితో కలిసి పాల్గొని, కేంద్ర ప్రభుత్వ నిధులతో నియోజకవర్గంలో జరుగుతున్న పలు కీలక అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు.నియోజకవర్గంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణాల్లో 90 శాతానికి పైగా అభివృద్ధి పనులు కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమవుతున్నాయని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. నేషనల్ హైవేలతో పాటు సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ , ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన , ఉపాధి హామీ పథకం ( ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారానే పల్లెలు, పట్టణాల్లో రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. తాను తొలిసారి ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు చేయించిన చేవెళ్ల–వికారాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పనులు గతంలో నిలిచిపోయినప్పటికీ, ఇప్పుడు శరవేగంగా సాగుతున్నాయని, రానున్న ఆరు నెలల్లో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి కానుందని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొంటారని, అలాగే సీఎస్సార్  నిధులతో స్థానిక స్వచ్ఛంద సంస్థ  చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటారని పేర్కొన్నారు. వికారా బాద్ జిల్లా నూతన బీజేపీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన అనంతరం, కేంద్ర మంత్రి అక్కడి  ఉమ్మడి మహబూబ్‌నగర్ పర్యటనకు బయలుదేరి వెళ్తారని వివరించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులందరూ పూర్తి సమన్వయంతో కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగ అంశాలు, రైతుల సంక్షోభంపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న రోజుల్లో విద్యార్థులు, రైతాంగ సమస్యలపై దశలవారీగా చేపట్టాల్సిన ప్రజా పోరాటాలపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కోరారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో ఆమె భేటీ అయ్యారు.ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, వైద్య సిబ్బంది నియామకం, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు  అంశాలపై మంత్రి సీతక్క వినతిపత్రం అందజేశారు.ఆసుపత్రిలో డ్రైనేజీ, పారిశుద్ధ్య పనుల కోసం అత్యవసరంగా రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ఓపీ (ఔట్ పేషెంట్) గదుల నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 5 నుంచి 10 పడకల సామర్థ్యంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల ని, కంటి సంబంధిత శస్త్రచికిత్సల కోసం క్రిటికల్ కేర్ బ్లాక్‌లో అధునాతన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావా లంటే ఆసుపత్రిలో ఎంఆర్ఐ యంత్రా న్ని ఏర్పాటు చేయాల్సిన అవసరంని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేక వ్యాధులపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి**

ములుగు వంటి ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులు అధికంగా కనిపిస్తున్న నేపథ్యంలో, ఈ వ్యాధులపై ప్రత్యేక అధ్యయనం, నిర్ధారణ, చికిత్స కోసం ములుగు జిల్లాలో ఒక ప్రత్యేక రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు.ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో కనిపించే ప్రత్యేక ఆరోగ్య సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, బాధితులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. ఈ పరిశోధన కేంద్రం ద్వారా ఆదివాసీ గిరిజనుల ఆరోగ్య పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి, దీర్ఘకాలిక వైద్య కార్యాచరణ రూపొందించవచ్చని తెలిపారు. ములుగు జిల్లా ప్రజలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని మంత్రి సీతక్క కోరారు.మంత్రి సీతక్క వినతిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. సంబంధిత అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# మక్తల్ అభివృద్ధికి 'శ్రీహరి మార్క్' సమీక్ష

శనివారం రోజున మక్తల్ లోని క్యాంపు కార్యాలయంలో మాగనూర్ మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించి, గ్రామాల వారీగా అభివృద్ధి పనులపై విస్తృతంగా సమీక్షించారు.ప్రతి గ్రామానికి 30 నిమిషాల సమయం కేటాయించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులతో మంత్రి నేరుగా చర్చించారు. ముఖ్యంగా SIR అంశంపై గ్రామాల వారీగా వివరాలు తెలుసుకుని, అవసరమైన చర్యలపై చర్చించారు.గ్రామాలోని సమస్యలపై మంత్రి నేరుగా ఆరా తీశారు.గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర అభివృద్ధి అవసరాలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామానికి ఏ పని అత్యవసరమో గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేలా సమీక్ష నిర్వహించారు.మక్తల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు చేరేలా చూడాలని మంత్రి శ్రీహరి నాయకులకు సూచించారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఒక్కో గ్రామానికి ప్రత్యేక సమయం కేటాయించి సమస్యలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా మంత్రి శ్రీహరి గ్రామాభివృద్ధిపై తనకున్న ప్రత్యేక దృష్టిని చాటుకున్నారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాగనూర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం..

భూమిపై హక్కు ఉన్నా రికార్డుల్లో హక్కు లేకుండా రైతులు ఇబ్బందులు పడే పరిస్థితికి ఇక ముగింపు పలుకుతున్నామని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తాతల కాలం నుంచి పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలను భూ భారతి ద్వారా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేసి, వాస్తవంగా భూమిని అనుభవిస్తున్న అర్హులైన రైతుల హక్కులను రికార్డుల్లో నమోదు చేస్తామని మంత్రి తెలిపారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే ప్రక్రియ చేపట్టామని చెప్పారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.రాబోయే సంవత్సరం కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌బుక్స్ అందిస్తాం. అర్హత ఉన్న ప్రతి భూ ఆసామికి న్యాయం చేస్తాం అని మంత్రి పునరుద్ఘాటించారు.

### రైతుకు భూమి హక్కు ఉంటేనే ఆర్థిక భరోసా

భూమికి చట్టబద్ధమైన హక్కు ఉంటేనే రైతుకు సంపూర్ణ ధైర్యం, ఆర్థిక భద్రత లభిస్తుందని  అన్నారు. భూ హక్కుల రికార్డులు సక్రమంగా ఉంటే రైతులు బ్యాంకు రుణాలు, రైతు సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను సులభంగా పొందగలుగుతారని తెలిపారు.

### అప్పుల భారం ఉన్నా సంక్షేమం ఆపలేదు

గత ప్రభుత్వం తమపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడా ఆగకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.రైతులకు న్యాయం చేయడం, పేదలకు ఇళ్లు ఇవ్వడం, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని స్పష్టం చేశారు.గడిచిన రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రంలోని మహిళలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని  తెలిపారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లోనూ ఇదే స్థాయిలో రుణాలు అందిస్తామని చెప్పారు.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు.హైదరాబాద్‌లో కోట్ల రూపాయల విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు.రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి తొలి విడతగా 3,500 ఇళ్లు, రెండో విడతగా 2,000 ఇళ్లు మంజూరు చేశామని, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదు అని  స్పష్టం చేశారు.భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పట్టాదారు పాస్‌బుక్స్ జారీ చేయడమే సరైన పరిష్కారమని అన్నారు.భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం వస్తుందని, రైతు భరోసా, రైతుబీమా తదితర ప్రభుత్వ ప్రయోజనాలను రైతులు పొందగలుగుతారని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో HAM రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

# రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా సమగ్ర విత్తన చట్టం తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం

వచ్చే పంటకాలానికైనా రైతులకు మేలు జరిగేలా విత్తన చట్టాన్ని అమల్లోకి తెచ్చే తదుపరి చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విత్తన చట్టం–2025పై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విత్తన ఉత్పత్తి, నాణ్యత, నియంత్రణ, విక్రయాలు, ధరల నియంత్రణతో పాటు విత్తన ఉత్పత్తి రైతుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

### గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ కమిటీ ఏర్పాటు

రాష్ట్రంలో సమగ్ర విత్తన చట్టం తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం గతంలోనే ప్రత్యేక విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ కమిటీ రైతులు, విత్తన కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు, డీలర్లు, పంపిణీ దారు లు, వ్యవసాయ అధికారులు తదితర వర్గాలతో సంప్రదింపులు నిర్వహించి, విత్తన రంగానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ సూచనల మేరకు విత్తన చట్టాన్ని తీసుకురావడానికి సిద్ధమవుతున్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వం ★విత్తన చట్టం–2025★ పేరుతో ముసాయిదా బిల్లును రూపొందించిందని మంత్రి పేర్కొన్నారు.కేంద్రం రూపొందించిన ముసాయిదా బిల్లుపై తెలంగాణ ప్రభుత్వం కూడా తన అభిప్రాయాలను తెలియజేస్తూ, కొన్ని అంశాలను సమ్మతించ డంతో పాటు, మరికొన్ని అంశాలపై అభ్యంతరాలు, సూచ నలు తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని తెలిపారు.

### నెలలు గడిచినా కేంద్రం నుంచి ముందడుగు లేదు

కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తన అభిప్రాయాలను, సూచనలను పంపి నెలలు గడిచినా విత్తన చట్టం విషయంలో కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదని మంత్రి తుమ్మల అన్నారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విత్తన చట్టాన్ని త్వరగా తీసుకురావాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసిందని తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం విషయంలో నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే ఒక పంటకాలం గడిచిపోయిందని, రైతుల ప్రయోజనాల కోసం ఇకపై మరింత జాప్యం చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు.

### వచ్చే పంటకాలానికైనా రైతులకు మేలు జరిగేలా చర్యలు

వచ్చే పంటకాలానికైనా విత్తన చట్టం అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ సూచనలు, రైతుల ప్రయోజనాలు, విత్తన రంగంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విత్తన చట్టం రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ దేశంలోనే ప్రముఖ విత్తన ఉత్పత్తి రాష్ట్రంగా, "Seed Bowl of India"గా గుర్తింపు పొందిన నేపథ్యంలో విత్తన రంగానికి సమగ్ర చట్టపరమైన వ్యవస్థ ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు.

### కేంద్రం నిర్ణయంతో సంబంధం లేకుండా రాష్ట్రం ముందుకు

కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకొచ్చినా, తీసుకురాకపోయినా రైతుల ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి చట్టం తీసుకొచ్చినట్లయితే దానికి అనుగుణంగా రాష్ట్రంలో అమలు చర్యలు చేపడతామని, ఒకవేళ కేంద్రం నుంచి అనుమతి లభించని పక్షంలో కూడా రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా విత్తన బిల్లును రూపొందించి, తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టి, సభ్యుల ఆమోదంతో రాష్ట్రంలో అమల్లోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

### విత్తన రైతులకు చట్టపరమైన రక్షణ

విత్తన ఉత్పత్తి రైతులకు చట్టపరమైన గుర్తింపు, రక్షణ కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రైతు–విత్తన కంపెనీ మధ్య నేరుగా పారదర్శక ఒప్పంద వ్యవస్థ ఉండేలా చూడాలని, మధ్యవర్తుల పాత్రను నియంత్రించాలని సూచించారు. విత్తన ఉత్పత్తికి రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పంట బీమా, నాణ్యతలేని విత్తనాల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు పరిహారం అందేలా చట్టబద్ధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### నకిలీ విత్తనాలపై కఠిన నియంత్రణ

నకిలీ, నాసిరకం, అనధికార విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కఠినమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. విత్తన ఉత్పత్తి ప్రాంతాలను క్రాప్ బుకింగ్, వ్యవస్థతో అనుసంధానం చేయాలని సూచించారు. మండల స్థాయిలో సీడ్ బ్యాంకులు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను ప్రోత్సహించడంతో పాటు సంప్రదాయ, దేశీయ విత్తన రకాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### పంట నష్టపోయిన రైతులకు సత్వర పరిహారం

నకిలీ, నాసిరకం లేదా నాణ్యతలేని విత్తనాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు సత్వరంగా పరిహారం అందేలా ప్రత్యేక చట్టబద్ధమైన వ్యవస్థను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. రైతుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు సమర్థవంతమైన ఏర్పాటు చేయాలని సూచించారు.

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

తెలంగాణ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం, విత్తన ఉత్పత్తి రైతులకు న్యాయం చేయడం, నకిలీ విత్తనాలను అరికట్టడం, పంట నష్టానికి పరిహారం కల్పించడం, విత్తన ధరలు మరియు మార్కెట్‌ను నియంత్రించడం, విత్తన రంగంలో పారదర్శకత, బాధ్యతను పెంపొందించడం సమగ్ర విత్తన చట్టం ప్రధాన లక్ష్యాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల విషయంలో జాప్యానికి తావు లేకుండా, రాష్ట్ర విత్తన రంగానికి బలమైన చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

### సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు

కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్  సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు.తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది.తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని.. అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ  టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు.హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

### కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం

తెలంగాణలో పర్యాటకం, క్రీడల ప్రచారం కోసం కపిల్‌దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని జూపల్లి తెలిపారు. ఆయన అనుభవం, అంతర్జాతీయ గుర్తింపును రాష్ట్ర పర్యాటక, క్రీడా రంగాల ప్రచారానికి ఉపయోగించుకుంటామని చెప్పారు.టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పన కొనసాగిస్తామని చెప్పారు.

### తెలంగాణ టూరిజం సహకారం అభినందనీయం

డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ తెలంగాణ టూరిజం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణ, హైదరాబాద్‌ను ప్రముఖ గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా ప్రచారం చేయవచ్చన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అందిస్తున్న వేదికకు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రపంచానికి హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ పరిచయం




హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ.. 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు.

### 132 మంది గోల్ఫర్లు.. రూ.కోటి ప్రైజ్‌మనీ

సెప్టెంబరు 1 నుంచి 4 వరకు జరిగే టోర్నీలో 132 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొననున్నారు. రూ.కోటి ప్రైజ్‌మనీ కోసం పోటీపడనున్నారు. భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటున్నారు. టోర్నీకి అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ (OWGR) పాయింట్లు లభించనున్నాయి.  కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ పాల్గొన్నారు.

### ఏఐ మాయలో పడొద్దు..

# జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలి





- **తప్పుడు సమాచారాన్ని ఛేదించేందుకు అత్యాధునిక ఫ్యాక్ట్‌చెకింగ్ టూల్స్ వినియోగించాలి**
- **ఏఐ సహాయకుడే తప్ప.. మానవ విచక్షణకు ప్రత్యామ్నాయం కాదు: సీనియర్ జర్నలిస్టు ఉడుముల సుధాకర్ రెడ్డి**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు, 29:**

కృత్రిమ మేధస్సు (ఏఐ) విస్తరిస్తున్న కొద్దీ తప్పుడు, వక్రీకరించిన సమాచార వ్యాప్తి కూడా పెరుగుతోందని, ఈ సవాలును ఎదుర్కొనేందుకు జర్నలిస్టులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫ్యాక్ట్‌చెకింగ్ సాధనాలతో నిరంతరం అప్‌డేట్ కావాలని సీనియర్ జర్నలిస్టు, టెక్నాలజీ నిపుణుడు ఉడుముల సుధాకర్ రెడ్డి సూచించారు.సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం గూగుల్, డాటా లీడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ ప్రొవెనెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐ ద్వారా రూపొందించిన లేదా మార్చిన ఫొటోలు, వీడియోలు, ఆడియోలు, సమాచారాన్ని గుర్తించి ధృవీకరించే విధానాలను జర్నలిస్టులకు వివరించారు."ఏఐని వృత్తిపరమైన సహాయకుడిగా ఉపయోగించాలి.. కానీ మానవ విచక్షణకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు" అని సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలు కొన్నిసార్లు వాస్తవం లేని సమాచారాన్ని సృష్టించే అవకాశం ఉందని, వీటినే 'హేల్యూసినేషన్స్' అంటారని తెలిపారు.ఏఐ ఇచ్చిన సమాచారాన్ని యథాతథంగా నమ్మి వార్తలు రాయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యమైన ప్రతి అంశాన్ని స్వతంత్రంగా ధృవీకరించడంతో పాటు, అవసరమైతే పలు ఏఐ మోడళ్లు, విశ్వసనీయ మానవ వనరుల ద్వారా క్రాస్‌చెక్ చేయాలని సూచించారు.

### డీప్‌ఫేక్‌లకు టెక్నాలజీతోనే చెక్

గూగుల్ అభివృద్ధి చేసిన SynthID, Backstory వంటి టూల్స్ ద్వారా ఏఐ కంటెంట్‌ను పరిశీలించే విధానాలను ఆయన వివరించారు. SynthID ద్వారా గూగుల్ ఏఐ సిస్టమ్స్‌తో రూపొందిన చిత్రాలు, వీడియోలు, ఆడియోల్లోని కనిపించని డిజిటల్ వాటర్‌మార్క్‌లను గుర్తించే అవకాశం ఉందన్నారు. అయితే ఏఐ కంటెంట్ అన్ని ప్లాట్‌ఫారమ్‌ల నుంచీ రావచ్చని, అందువల్ల HiDetect AI, airma.com, PimEyes వంటి ఇతర సాధనాలను కూడా అవసరానికి అనుగుణంగా ఉపయోగించాలని సూచించారు.సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలించడం ద్వారా బాట్స్, ఆటోమేటెడ్ అకౌంట్లను గుర్తించవచ్చని తెలిపారు. అనుమానాస్పద ఫొటోల మూలాన్ని తెలుసుకోవడంలో ఫేషియల్ సెర్చ్ టూల్స్ ఉపయోగపడతాయని చెప్పారు.

### ఒక్క ఫొటోతో కథనం నమ్మొద్దు

ఒక ఫొటో లేదా వీడియో నిజంగా పేర్కొన్న ప్రాంతానికి, సందర్భానికి సంబంధించినదేనా తెలుసుకునేందుకు Google Street View, Google Earth Pro వంటి జియోలోకేషన్ సాధనాలను ఉపయోగించవచ్చని సుధాకర్ రెడ్డి తెలిపారు. ప్రదేశంలోని భౌగోళిక పరిస్థితులు, భవనాలు, రహదారులు, పాత చిత్రాలను పోల్చడం ద్వారా కంటెంట్ నిజ స్వరూపాన్ని నిర్ధారించవచ్చన్నారు.

### 'ప్రాంప్ట్' సరిగ్గా ఇస్తేనే మెరుగైన ఫలితం.

ఏఐని సమర్థవంతంగా వినియోగించేందుకు జర్నలిస్టులు Prompt Engineeringపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఏఐకి స్పష్టమైన పాత్ర, అవసరమైన నేపథ్యం, కావాల్సిన ఫార్మాట్‌ను నిర్దేశిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. అదే సమయంలో ఏఐ ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే విషయాలను కూడా స్పష్టంగా చెప్పాలని సూచించారు. ఏఐ తన శిక్షణ డేటాలోని పక్షపాతాలను, మూస ధోరణులను కూడా పునరుత్పత్తి చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఎలాంటి ధృవీకరణ లేకుండా ప్రచురించకూడదన్నారు. ఇప్పటివరకు జర్నలిస్టులు, విద్యార్థులు సహా 10,000 మందికి పైగా వ్యక్తులకు ఫ్యాక్ట్‌చెకింగ్, ఏఐ బాధ్యతాయుత వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు సుధాకర్ రెడ్డి తెలిపారు.మీడియా సంస్థల సంపాదకీయ ప్రమాణాలను కాపాడే తుది బాధ్యత జర్నలిస్టులదేనని పేర్కొన్న ఆయన.. నిరంతర అభ్యాసం, ఫ్యాక్ట్‌చెకింగ్ నైపుణ్యాలు, స్వీయ కేస్‌స్టడీల ద్వారా డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, వక్రీకరించిన కంటెంట్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు.కార్యక్రమం అనంతరం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల,ఉపాధ్యక్షులు ఏ. రాజేష్ , అత్తలూరి అరుణ, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ తదితర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వనం నాగరాజు, దయ్యాల అశోక్, కస్తూరి శ్రీనివాసులు సుధాకర్ రెడ్డిని సన్మానించి అభినందించారు.

### హిమజ ప్రతిభకు అరుదైన గౌరవం :

# లండన్ వాల్యూయ్స్ జడ్జ్ సర్టిఫికెట్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

లండన్ వరకు లుక్కా హిమజ ప్రతిభ.. బ్రిటన్ మహారాణి నిర్వహించే రచనా పోటీకి న్యాయనిర్ణేతగా అరుదైన గుర్తింపు అంతర్జాతీయ రచనా పోటీలో జడ్జిగా తెలంగాణ న్యాయవాది లుక్కా హిమజ... రాయల్ కామన్వెల్త్ సొసైటీ నుంచి 'వాల్యూడ్ జడ్జ్' సర్టిఫికెట్.తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా నమోదై, ప్రస్తుతం హైకోర్టు ప్రముఖ మహిళా న్యాయమూర్తి ఆధ్వర్యంలో లీగల్ రీసెర్చర్ గా సేవలందిస్తున్న లుక్కా హిమజ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు.ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన అంతర్జాతీయ రచనా పోటీలలో ఒకటైనది. క్వీన్స్ కామన్వెల్త్ రైటింగ్ కాంపిటీషన్ 2026 కి న్యాయనిర్ణేతగా వ్యవహరించినందుకు రాయల్ కామన్వెల్త్ సొసైటీ ఆమెకు 'వాల్యూడ్ జడ్జ్' సర్టిఫికెట్ అందజేసింది.1883లో ప్రారంభమైన ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ రచనా పోటీకి ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు ఉంది. పోటీ విజేతల కోసం నిర్వహించే విన్నర్స్ వీక్కార్యక్రమం లండన్లోని రాజభవనంలో క్వీన్ ఆతిథ్య మిచ్చే ప్రత్యేక అవార్డు వేడుకతో ముగుస్తుంది. ఇలాంటి అంతర్జాతీయ స్థాయి పోటీలో న్యాయనిర్ణేతల బృందంలో చోటు దక్కించుకోవడం హిమజకు అరుదైన గౌరవంగా నిలిచింది.విద్యారంగంలో కూడా హిమజ చిన్నప్పటి నుంచే విశేష ప్రతిభకనబరిచారు. 10/10 పాఠశాలలో జీపీఏ, ఇంటర్మీడియట్లో కళాశాల ప్రథమ స్థానం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఏ.ఎల్.ఎల్.బి. ఐదేళ్ల కోర్సులో క్యాంపస్ ప్రథమ స్థానం, తెలంగాణ పీజీ లాసెట్లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించారు. అనంతరం ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా లో పబ్లిక్ లా అండ్ లీగల్ థియరీలో ఎల్.ఎల్.ఎం.పూర్తి చేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో లీగల్ రీసెర్చర్గా సేవలందిస్తున్న హిమజ, భవిష్యత్తులో న్యాయమూర్తిగా సేవలందించాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నారు. ఆమె తల్లిదండ్రులు లుక్కా చంద్రశేఖరరావు, లుక్కా సురేఖ ఇద్దరూ న్యాయవాదులు కాగా, సోదరి డాక్టర్ దివిజ జనరల్ మెడిసిన్లో ఎం.డి. అభ్యసిస్తున్నారు. జనరల్ మెడిసిన్ల ఎం.డి. అభ్యసిస్తున్నారు. బ్రిటిష్ రాజకుటుంబాని కి చెందిన ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పోటీలో హిమజకు లభించిన ఈ గుర్తింపు తెలంగాణకు, న్యాయవాద సమాజానికి గర్వకారణంగా, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.



# వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని భీమేశ్వరాలయంలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రాజన్న సిరిసిల్ల జిల్లా వెలుతురు ఆగస్టు 29:**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలోని భీమేశ్వరాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారితో కలిసి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది.మన ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుఖసంతోషాలతో, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించాను.కొత్తకొండ వీరభద్రస్వామి, నక్షత్ర మాల వేసుకున్న సందర్భంగా వేములవాడ రావడం జరిగింది .కొత్తకొండ వీరభద్ర స్వామి వారి ఆలయం కాకతీయుల కాలం నాటి గొప్ప చరిత్ర ఉంది. ఆధ్యాత్మికతతో పాటు మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ పుణ్యక్షేత్రాలను ప్రతి ఒక్కరూ దర్శించుకుని దైవ ఆశీస్సులు పొందాలని కోరుకుంటున్నాను. ఇటీవల కొండగట్టు పాదయాత్రతో పాటు వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కూడా పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలందరూ శాశ్వత సుఖసంతోషాలతో, ఐక్యతతో, అభివృద్ధితో ముందుకు సాగాలన్నదే మా ఆకాంక్ష. ఆ భగవంతుడిని ఇదే కోరుకుంటున్నాను. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు కాపాడుకోవాలి.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల సవరణ కార్యక్రమం కొనసాగుతోంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన హక్కు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.చిన్నచిన్న స్పెల్లింగ్ తప్పులు, పేర్లు లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు ఉన్నా, ఓటర్లకు నోటీసులు అందినా వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి తమ ఓటును సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా బూత్ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా, ఇప్పటికే ఉన్న ఓట్లలో తప్పులు ఉంటే సరిచేసుకునేలా ప్రజలకు సహకరించాలి.గతంలో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల పునర్విమర్శ ప్రక్రియపై రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి. తెలంగాణలో మాత్రం అర్హత ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడబడేలా ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలి.ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావులేకుండా సజావుగా పూర్తికావాలి. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదు.తెలంగాణ ప్రజలందరికీ నా విజ్ఞప్తి ఒక్కటే మీ ఓటును మీరు కాపాడుకోండి. ఓటర్ల సవరణలో మీ పేరు, వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తప్పకుండా పరిశీలించుకోండి.ఎన్నికల కమిషన్ ఓ పార్టీ తొత్తుగా వ్యవహరిస్తుందని విమర్శలు ఉన్నాయి .. పలు రాష్ట్రాల్లో జరిగిన ఓటరు సవరణ ప్రక్రియ తరువాత జరిగిన ఎన్నికల ఫలితాలు చూశాం





### ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాస్వామ్యంలో మన చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు. ఆ హక్కును ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన కోరుతున్నాను.

# తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు తప్పనిసరి

- **ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పే విధానాన్ని సహించేది లేదు**
- **పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు**
- **రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరగాలి**
- **ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వెలుతురు హైదరాబాద్, సూర్యాపేట ఆగస్టు 29:**

తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో తప్పనిసరిగా స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజల ను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పే విధానానికి స్వస్తి పలకాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. చట్టంలోని నిబంధనలను పాటిస్తూనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అధికారులు పనిచేయాలని అన్నారు.శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు.

### 45 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచడంపై వివరణ

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్‌లో భూములకు సంబంధించిన 45 దరఖాస్తులు ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని మంత్రి ప్రస్తావించారు. ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్‌ను వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడం సరికాదని, ప్రతి దరఖాస్తుపై అధికారులు బాధ్యత తీసుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.

### ప్రజలను ఇబ్బంది పెట్టే విధానాలకు చోటు లేదు

తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు తమ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సేవా దృక్పథంతో పరిష్కరించాలని మంత్రి అన్నారు. అవసరం లేని పత్రాలు, ప్రక్రియల పేరుతో ప్రజలను తిప్పుకోవడం, చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోజుల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి విధానాలను నివారించాలని స్పష్టం చేశారు.అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి.. ప్రజల సమస్యలను పరిష్కరించాలి.. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చిన వ్యక్తి సంతృప్తితో తిరిగి వెళ్లేలా చూడాలి అని మంత్రి సూచించారు.రీ-సర్వేలోనూ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణరాష్ట్రవ్యాప్తంగా తొలి విడత చేపట్టిన రీ-సర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత రీ-సర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే అధికారులు సిద్ధం కావాలని సూచించారు.తొలి విడతలో రీ-సర్వే చేపడుతున్న 70 గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారించాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రీ-సర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఆర్డీవోలు, తహసీల్దార్లు కూడా గ్రామసభలకు హాజరై పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు.సర్వే నిర్వహించిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని అన్నారు. విధులకు హాజరుకాని లైసెన్స్డ్ సర్వేయర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల



సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించాలిఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో ఉన్న ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు.మొదటి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను దసరాలోపు పూర్తి చేయాలని, గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను గుర్తించి 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సిమెంట్ కంపెనీలతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్లకు సమీపంలో ఎక్కడ ఇసుక లభిస్తే అక్కడి నుంచి అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ఇంటి పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి

గతంలో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించినప్పటికీ ఇంకా పంపిణీ చేయని వాటిని వెంటనే గుర్తించి జాబితా రూపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను కూడా చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలకు పరిష్కారం చూపడమే రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు.

# ఉద్యమకారుల విజ్ఞప్తులపై సీఎం పూర్తి సానుకూలత

- **గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు**
- **ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారితో భేటీ అయిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29, :**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (G.O.Rt.No.679) గౌరవ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు (కేకే) గారి నేతృత్వంలో కమిటీ ప్రతినిధి బృందం నేడు సచివాలయంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి సుదీర్ఘంగా సమావేశమైంది.ఈ కీలక సమావేశంలో గౌరవ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీ మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు.ఇటీవల అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వేదికగా 13,000 మందికి పైగా ఉద్యమకారులు, వివిధ జేఏసీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మరియు మహిళా ఉద్యమకారులతో నిర్వహించిన విస్తృత స్థాయి సంప్రదింపుల వివరాలను, ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా వారు సమర్పించిన ప్రధాన విజ్ఞప్తుల నివేదికను కమిటీ ముఖ్యమంత్రి కి సమర్పించి సమగ్రంగా వివరించింది.

### ఉద్యమకారుల సేవకు ప్రభుత్వం సిద్ధం —— సీఎం శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి స్పందన:

కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు.. ఉద్యమకారుల విజ్ఞప్తుల పట్ల అత్యంత సానుకూలంగా స్పందించారు. ఆత్మగౌరవ సంక్షేమం: స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టిన తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం, వారి కుటుంబాలకు సేవ చేయడం ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఎలాంటి జాప్యం లేకుండా కసరత్తు పూర్తి: ఉద్యమకారుల గుర్తింపు , సంక్షేమ కసరత్తును ఎక్కడా ఆలస్యం చేయకుండా, అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని కమిటీకి సూచించారు.

### కమిటీకి పూర్తి సహకారం అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు:

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి గారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ వి. శేషాద్రి, ఐఏఎస్ (Sri V. Seshadri, IAS – Special Chief Secretary to CM), ముఖ్యమంత్రి గారి కార్యదర్శి శ్రీ చంద్రశేఖర్ రెడ్డి, ఐఏఎస్ / శ్రీ వి.పి. గౌతమ్, ఐఏఎస్ / శ్రీ ఎస్. శ్రీధర్, ఐఏఎస్ (Sri S. Sridhar, IAS – Secretary to CM), ముఖ్యమంత్రి గారి ఓఎస్డీలు (OSDs to CM) మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ పోర్టల్ రూపకల్పన, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీ సమన్వయం మరియు అవసరమైన పరిపాలనాపరమైన వనరుల కల్పనలో కమిటీకి పూర్తి స్థాయిలో అధికారిక సహకారాన్ని అందించాలని హాజరైన ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.



### ముఖ్యమంత్రి గారికి కమిటీ కృతజ్ఞతలు:

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ జీవో నెం. 679 ద్వారా కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా.. ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలాలు, ఆసరా పెన్షన్, హెల్త్ కార్డ్స్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం , ఉద్యోగులకు గౌరవ గుర్తింపు అంశాలపై ఎంతో సానుకూలంగా స్పందించినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి చైర్మన్ కేకే గారు, కోదండరామ్ గారు, శోభన్ రెడ్డి గారు, రాములు నాయక్ గారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### మీడియా సెల్, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

అన్ని ప్రముఖ దినపత్రికలు, న్యూస్ ఛానళ్లు మరియు డిజిటల్ మీడియా మాధ్యమాలలో ప్రచురణ/ప్రసారం కొరకు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు







- గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా కార్యక్రమాలు.. పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, VC&MD సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, క్రీడా శాఖ అధికారులు, హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి, VC&MD సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, అధికారులు, క్రీడాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం తెలంగాణ హాకీ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి ప్రారంభించారు.

- క్రీడాకారులకు మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు
- జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. భారతీయ క్రీడాస్ఫూర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు.
- ధ్యాన్‌చంద్ తన అద్భుతమైన ఆటతీరు, క్రమశిక్షణ, ఏకాగ్రతతో భారత హాకీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. ఆయన జీవితం ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
- ఆటలపై మక్కువ, ఏకాగ్రత, క్రమశిక్షణ ఉంటే విజయాన్ని సాధించవచ్చని మంత్రి అన్నారు.
- ప్రస్తుత తరం యువత సోషల్ మీడియా రీల్స్‌పై కాకుండా తమ భవిష్యత్తు కోసం క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు.
- “రీల్స్ కోసం కాకుండా.. రియల్ లైఫ్ కోసం ఆటలు ఆడండి”*అని మంత్రి యువ క్రీడాకారులకు పిలుపునిచ్చారు.
- మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు.
- క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు, శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.




# ప్రజా సమస్యలపై సెప్టెంబర్‌లో బీజేపీ విస్తృత ప్రజా ఉద్యమాలు: డా. ఎన్. గౌతమ్ రావు

- 22-A నిబంధనల ఉపసంహరణకై సెప్టెంబర్ 5, 6 తేదీల్లో ఇందిరా పార్క్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల దీక్ష
- సెప్టెంబర్ 7న నిరుద్యోగ, విద్యార్థి సమస్యలపై బీజేవైఎం ఆధ్వర్యంలో 'మహాధర్నా'
- రైతాంగ సమస్యలపై కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో విస్తృత యాత్ర





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

హైదరాబాద్‌లోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రామచందర్ రావు గారి అధ్యక్షతన పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేత (BJLP Leader) శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమగ్రంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతమ్ రావు గారు మీడియా సమావేశంలో పార్టీ నిర్ణయాలు, సెప్టెంబర్ నెల భవిష్యత్ కార్యాచరణ వివరాలను వెల్లడించారు.

**కీలక ఆందోళన కార్యక్రమాలు:**

**సెప్టెంబర్ 5, 6 తేదీల్లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల దీక్ష:**

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వివాదాస్పద 22–A భూముల నిషేధిత నిబంధనలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ.. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ శాసనసభాపక్ష నేత శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు భారీ నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఈ దీక్ష కొనసాగుతుంది.

**సెప్టెంబర్ 7న బీజేవైఎం ఆధ్వర్యంలో 'మహాధర్నా':**

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద భారీ 'మహాధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

**రైతు సమస్యలపై కిసాన్ మోర్చా యాత్ర:**

రైతు భరోసా నిధుల విడుదల, పంటల బీమా అమలు, రుణమాఫీ పూర్తిస్థాయి అమలు మరియు వ్యవసాయ రంగంలో రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభంపై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విస్తృత రైతు యాత్రను చేపట్టాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 7 తర్వాత ప్రారంభం కానున్న ఈ యాత్ర తేదీలు, పూర్తి కార్యాచరణ షెడ్యూల్‌ను త్వరలోనే పార్టీ అధికారికంగా ప్రకటిస్తుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని డా. ఎన్. గౌతమ్ రావు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై భారతీయ జనతా పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని, క్షేత్రస్థాయి నుంచి ప్రజా ఉద్యమాలను ఉధృతం చేసి రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచుతామని ఆయన స్పష్టం చేశారు.

# నందిని సిధారెడ్డిని ఘనంగా సన్మానించిన 'టాక్' ప్రతినిధులు

- సిధారెడ్డికి ప్రతిష్ఠాత్మక సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం పట్ల టాక్ హర్షం
- కరోనా కాలంలో రాసిన 'అనిమేష'కు పురస్కారం
- సాహిత్య అకాడమీ పురస్కారంతో తెలంగాణ సాహిత్య ప్రతిష్ఠ మరింత ఇనుమడింపు
- సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం తెలంగాణ సాహిత్యానికి గర్వకారణం
- తెలంగాణ సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్న సిధారెడ్డికి టాక్ అభినందనలు
- తెలంగాణ సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు 'టాక్' చేస్తున్న సేవలు అభినందనీయం: నందిని సిధారెడ్డి



**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 30:**

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్, ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డిని తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన రచించిన 'అనిమేష' వచన కవితా సంపుటికి 2025 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'టాక్' సంస్థను అభినందించారు. లండన్‌లో టాక్ ఆవిర్భావ కార్యక్రమానికి హాజరైన నాటి నుంచి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను నిశితంగా గమనిస్తున్నానని తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని గత తొమ్మిదేళ్లుగా టాక్ సంస్థ ముందుకు సాగుతున్న తీరు అభినందనీయమని అన్నారు. ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా సంస్థ తన లక్ష్యాలను కొనసాగిస్తూ స్థిరంగా ముందుకు సాగడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సంస్థను ఏర్పాటు చేయడం మాత్రమే గొప్ప విషయం కాదని, దానిని దీర్ఘకాలం కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని నందిని సిధారెడ్డి అన్నారు. టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, మాజీ అధ్యక్షురాలు పవిత్ర రెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు రత్నాకర్ కడుదులతో పాటు కార్యవర్గ సభ్యుల కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి తాను రచించిన, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న అనిమేష కవితా సంపుటితో పాటు తన ఇతర పుస్తకాలను టాక్ ప్రతినిధులకు బహూకరించారు. టాక్ సంస్థకు చీఫ్ అడ్వైజర్లుగా నందిని సిధారెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు.

**తెలంగాణకు గర్వకారణం: అనిల్ కూర్మాచలం**

టాక్ వ్యవస్థాపకుడు, తెలంగాణ ఎఫ్‌డిసి మాజీ ఛైర్మన్ అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తన పాట, సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని సిధారెడ్డి చూరగొన్నారని, ఆయన తన రచనల ద్వారా తెలంగాణ సాహిత్యానికే వన్నె తెచ్చారని కొనియాడారు. నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం యావత్ తెలంగాణకు గర్వకారణమన్నారు. తమకు గురువులా మార్గనిర్దేశం చేస్తూ, ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్న నందిని సిధారెడ్డికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం రావడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.టాక్ ప్రతినిధులతో కలిసి నందిని సిధారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమపై నందిని సిధారెడ్డికి ఉన్న ప్రేమాభిమానాలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో పాటు సాహిత్య రంగానికి మరింత సేవ చేయాలని కోరుకున్నారు.టాక్ కమ్యూనిటీ అఫైర్స్ ఛైర్‌పర్సన్ గణేష్ కుప్పాల, అడ్వైజరీ బోర్డు సభ్యురాలు జాహ్నవి దూసరి మాట్లాడుతూ నందిని సిధారెడ్డి భవిష్యత్తులోనూ టాక్ సంస్థకు విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ సంస్థను మరింత ముందుకు నడిపించాలని కోరారు. తమకు విలువైన సమయం కేటాయించి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తెలంగాణ సాహిత్య రంగానికి చేసిన సేవలకు, సుదీర్ఘ సాహిత్య కృషికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టాక్ సభ్యురాలు నవ్య కుప్పాల, తిరుమందాస్ నరేష్ గౌడ్, జర్నలిస్ట్ బత్తిని వినయ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

- ఆన్ లైన్ లో ఎంపికైనవారి వివరాలు
- అభ్యంతరాలు ఫిర్యాదులకు అవకాశం

**హైదరాబాద్, వెలుతురు ఆగస్ట్ 29:**


ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం లాటరీ ప్రక్రియలో భాగంగా శనివారం నాడు 1920 ఇండ్లను కేటాయించారు. ఖైరతాబాద్ కూకట్ పల్లి, బహదూర్ పుర, అంబర్ పేట నియోజక వర్గాల్లో నిర్మించనున్న ఇండ్లకు సంబంధించిన లాటరీని స్థానికంగా ఆయా ప్రాంతాల్లోని వివిధ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో నూ అధికారులు, దరఖాస్తుదారుల సమక్షం లో పూర్తి పారదర్శకంగా లాటరీ కొనసాగింది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 16 నియోజక వర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ప్రాథమిక అర్హతల నిర్ధారణ అనంతరం అర్హులైన వారికి లాటరీ ప్రక్రియ ద్వారా ఇండ్ల కేటాయింపు జరిపారు. ఆగస్టు 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ లాటరీ ప్రక్రియను గౌరవనీయులైన రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం నాడు ప్రారంభించారు. అందులో భాగంగా రెండవ రోజు కూడా లాటరీ ప్రక్రియ విజయవంతంగా ముగిసిం ది. ప్రక్రియలో మూడవ రోజు ఆగస్టు 30వ తేదీ ఆదివారం నాడు నాడు శేరిలింగం పల్లి, మలక్ పేట, మేడ్చల్ ఇబ్రహీం పట్నం, నియోజకవర్గాలకు చెందిన లాటరీ నిర్వహిస్తారు.

**ఆన్ లైన్ లో వివరాలు-అభ్యంతరాల స్వీకరణ**

ఇందిరమ్మ ఇల్లు టవర్స్ కోసం లాటరీలో ఎంపికైన వారి వివరాలు ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచుతున్నామని హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ శ్రీ విపి గౌతమ్ తెలిపారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. దరఖాస్తు స్వీకరణ సమయంలో ఎటువంటి ధ్రువపత్రాలను తీసుకోనందున, దరఖాస్తుదా రులు ఇచ్చిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించుకునేందుకు ఈ పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా లాటరీలో ఎంపికైన వారి విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఫిర్యాదులు ఉంటే తెలియజేసే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హులైన వారికే ఇండ్ల కేటాయింపు జరగాలనే లక్ష్యంతో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో ఎటువంటి అపోహలు అనుమానాలకు తావు లేదని స్పష్టం చేశారు.

# మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ
## ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎంతో మారిషస్ బృందం భేటీ

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**



మారిషస్ లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాలను ప్రమోట్ చేసేందుకు ఆదేశానికి అన్ని విధాలా సహకరిస్తామని మారిషస్ ప్రతినిధులుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క్ చెప్పారు. శనివారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా బృందం ఉప ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క వారితో మాట్లాడుతూ.. తెలంగాణ – మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య స్నేహపూర్వ సంబంధాలున్నామని గుర్తు చేశారు. తెలుగు భాష, సంస్కృతి, సం ప్రదాయాల ద్వారా తెలంగాణకు మారి షస్ తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మారిషస్‌లోని తెలుగు సమాజం అక్కడి గొప్ప బహుళ సాంస్కృతిక సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. మారిషస్ ప్రభుత్వం చేపడుతున్న రామ భజనంను కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తెలం గాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాష, సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మారిషస్ లోని తెలుగు కల్చరల్ సెంటర్ లో లక్షలాదిమంది తెలుగు ప్రవాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను, భాష పరిరక్షణ చేస్తున్నారని మారిషస్ మంత్రి తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు, తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషి పట్ల వారు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

# కూకట్ పల్లిలో కబ్జాల రాజ్యం నడిపిన మాధవరం: సీఎం రేవంత్ పై విమర్శలు చేస్తే సహించేది లేదు..

- **అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? – టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సవాల్**

**కూకట్ పల్లి ఆగస్టు 29 వెలుతురు:**
గత పదేళ్ల పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేని స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తన స్థాయిని మర్చిపోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. వందల కోట్ల విలువైన భూముల దోపిడీ కృష్ణారావు హయాంలో నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, నాలాలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురయ్యాయని బండి రమేష్ మండిపడ్డారు.

- **హస్మత్‌పేట్ సర్వే నెం.1: 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విలువైన భూమిలో ప్రస్తుతం కేవలం 10 ఎకరాలు మాత్రమే మిగిల్చి, మిగిలిన 90 ఎకరాలను కాజేశారని అన్నారు.**
- **అల్లాపూర్, గోపాల్ నగర్: అల్లాపూర్‌లో 4 ఎకరాల స్థలంలో 2 ఎకరాలు, గోపాల్ నగర్‌లో ఏకంగా 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని కృష్ణారావు, ఆయన అనుచరులు కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు.**
- **ఆస్తుల పెరుగుదలపై ప్రశ్న: "మొదటిసారి కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పుడు మీ ఆస్తుల విలువ ఎంత? నేడు మీకున్న వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయి?" అని ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించారు.**
- **సానుభూతి కోసమే ఆత్మహత్య నాటకాలు**

రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా (22A) భూముల సమస్యపై ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రమేష్ ఆరోపించారు. రాజకీయ మనుగడ కోసమే "ఉరి, హత్య, ఆత్మహత్య" అంటూ ప్రజల్లో సానుభూతి పొందేందుకు డ్రామాలు ఆడుతున్నారని, ఆయనను చంపాల్సిన అవసరం ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిపై మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముకున్నప్పుడు గుర్తుకురాని హౌసింగ్ బోర్డు స్థలాలు, ఇప్పుడు గుర్తుకొస్తున్నాయా అని నిలదీశారు.




**అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం..?**

దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) కాలం నుంచి కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన పనులపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమా అని బండి రమేష్ సవాల్ విసిరారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళా సంక్షేమం కోసం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పెట్రోల్ బంకులు, బస్సుల కేటాయింపు వంటి విప్లవాత్మక నిర్ణయాలు అమలవుతున్నాయన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవాక్‌ల నిర్మాణం చేపడుతున్నామని, పేదల వైద్యం కోసం రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమాతో పాటు అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే సంపూర్ణ విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కబ్జా ఆరోపణలు చేస్తే సహించేది లేదు: బండి రమేష్ పై బీఆర్ఎస్ నేత రెడ్డి సతీష్ అరోరా ధ్వజం..

- **హైదర్‌నగర్, హస్మత్‌పేట భూములపై 1958 నుంచి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్**

**కూకట్ పల్లి ఆగస్టు 29 వెలుతురు:**

కూకట్‌పల్లి అభివృద్ధి ప్రదాత, హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై నిరాధారమైన భూకబ్జా ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా హెచ్చరించారు. అధికారం కోసం తరచూ పార్టీలు మారే పారాచూట్ నేత బండి రమేష్‌కు స్థానిక సమస్యలు, భూముల పూర్వాపరాలు తెలియవని ఆయన ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**ప్రైవేట్ భూములను 22ఏలో చేర్చి బ్లాక్‌మెయిల్ రాజకీయం**

ప్రభుత్వ భూములు ఏవో, ప్రైవేట్ భూములు ఏవో కూడా రమేష్‌కు, ఆయన ప్రభుత్వానికి అవగాహన లేదని సతీష్ అరోరా ఎద్దేవా చేశారు. "ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అక్రమ వసూళ్లకు పాల్పడేందుకే ప్రైవేట్ భూములను రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా (22A)లో చేర్చి సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు.

**న్యాయస్థానాల తీర్పుల ప్రకారమే నిర్మాణాలు**

హైదర్‌నగర్ సర్వే నంబర్లు 145, 163, హస్మత్‌పేట్ సర్వే నంబర్ 1 భూములు CS-14 కింద 'పైగా ప్రాపర్టీస్'గా నమోదై ఉన్నాయని, వీటిపై హైకోర్టు, సుప్రీంకోర్టులు ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని గుర్తుచేశారు. ఆ తీర్పుల ఆధారంగానే సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఇళ్లు కట్టుకున్నారని, ఇందులో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాత్ర ఏముందో దర్యాప్తు సంస్థల ద్వారా నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

**దమ్ముంటే 1958 నుంచి విచారణ జరపండి**

కూకట్‌పల్లి పరిధిలోని వివాదాస్పద భూములపై 1958 నుంచి ఇప్పటివరకు ఏయే రాజకీయ నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక విచారణ జరపాలని సతీష్ అరోరా సవాల్ విసిరారు. ఒకవైపు 22A బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటిస్తూనే, మరోవైపు అవే భూములను కబ్జా భూములంటూ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు.

**మీ పార్టీ నేతల ఆక్రమణలు కనిపించడం లేదా?**

- **హస్మత్‌పేట సర్వే నెం.1: గతంలో ఎమ్మెల్సీగా ఉండి, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఒక ముఖ్య నేత ఇరవై ఏళ్ల క్రితమే హస్మత్‌పేట సర్వే నెం.1 భూముల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించిన విషయం కూకట్‌పల్లి ప్రజలందరికీ తెలుసని, దమ్ముంటే దానిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.**
- **భూముల పరిరక్షణ: అల్లాపూర్, గోపాల్ నగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే, బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుని కాపాడినట్లు స్పష్టం చేశారు.**



- **అవినీతి చరిత్ర: కాంగ్రెస్ పార్టీ నాయకుల అవినీతి చరిత్రను గుర్తిస్తూ ఇటీవల ముగ్గురు నేతలను పార్టీ నుంచే తొలగించారని, అలాంటి పార్టీకి చెందిన నాయకుడు ప్రజాదరణ పొందిన నేతలపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు.**

ప్రజాక్షేత్రంలో ఎన్నడూ గెలవని, రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేని నేతలు మూడుసార్లు వరుసగా గెలిచిన ప్రజాప్రతినిధిపై అవాకులు చవాకులు పేలితే రాజకీయంగా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పదవుల కోసం ఏ క్షణమైనా పార్టీ మారే అవకాశవాద నేత పట్ల కాంగ్రెస్ శ్రేణులే అప్రమత్తంగా ఉండాలని ఆయన హితవు పలికారు.

# మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కూకట్ పల్లిలో 'ఎండ్ ఇట్ నౌ' ర్యాలీ

- **మహిళలు, చిన్నారులపై దాడులు ఆగాలంటూ ప్లకార్డులతో నిరసన**

**కూకట్ పల్లి ఆగస్టు 29 వెలుతురు:**
మానవ అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ కూకట్‌పల్లిలో శనివారం "ఎండ్ ఇట్ నౌ" (End It Now) పేరిట భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అడ్డగుట్టలోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ (SDA) చర్చ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు, చిన్నారులు పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ నుంచి అడ్డగుట్ట వరకు భారీ ప్రదర్శన ఎస్డీఏ సీనియర్ పాస్టర్ డాక్టర్ నల్లి చిట్టిబాబు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ జేఎన్‌టీయూ చౌరస్తా, ప్రగతి నగర్ రోడ్డు మీదుగా అడ్డగుట్ట ఎస్డీఏ చర్చి వరకు ప్రధాన రహదారుల గుండా సాగింది.

**సమాజంలో చైతన్యం రావాలి: నిర్వాహకులు**

ఈ సందర్భంగా పాస్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ ఆధునిక సమాజంలోనూ మహిళలు, చిన్నారుల హక్కుల ఉల్లంఘన కొనసాగడం ఆందోళనకరమని, వీటికి తక్షణమే ముగింపు పలకాలన్న సంకల్పంతోనే ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు స్పష్టం చేశారు.

- **ఎస్డీఏ చర్చ్ మహిళా విభాగం సభ్యులు మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు రాసిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు.**



- **మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసను సమాజం సహించకూడదని ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈసీఐయూ (ECIU) కార్యనిర్వాహక కార్యదర్శి పాస్టర్ చార్లెస్‌తో పాటు పలువురు చర్చి ప్రతినిధులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.**

# ఆరుట్లలో మృతుడి కుటుంబానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ బియ్యం పంపిణీ

- **మానవత్వమే మహోన్నత సేవ బిఆర్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడు పేద ప్రజలకు అండగా ఉంటుంది పౌండేషన్ సభ్యులు**

**మంచాల వెలుతురు ఆగస్టు 29:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రావుల బీరప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి దశదినకర్మ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి గారి ఆదేశాల మేరకు వారికి అండగా నిలిచే ఉద్దేశంతో బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో1క్వింటాల్ బియ్యాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు ఈసందర్భంగా బీరప్పకుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ అవసరమైన సమయంలో మానవత్వంతో చేయూతనిస్తున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం అన్నారు ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము మాట్లాడుతూ బిఆర్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడు పేద ప్రజల కు అండగా ఉంటూ సేవలు చేస్తుంది అనిఅన్నారు.ఈకార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆరుట్ల బిఆర్ ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పున్నంరాము షాకేర్ ఏర్పుల శివబాలం మహేష్ రావులరజిని పెద్ద కురుమ రావుల బాషయ్య షెల్వోజి చిందం యాదయ్య కులపెద్దలుకు రామచంద్రిల జం గయ్య రావుల యాదయ్య,చెరుకు ఐలయ్య, రావుల బాలయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్ పల్లి ఆగస్టు 29 వెలుతురు:**
ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వ్యాధులను ముందస్తుగా గుర్తిం దుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సూచించారు. కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాధవ్‌బాగ్ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద క్లినిక్స్ అండ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత జీవనశైలి కారణంగా మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, థైరాయిడ్, అధిక బరువు వంటి




సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండకుండా ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నియంత్రించవచ్చని తెలిపారు. మెగా మెడికల్ క్యాంప్‌లో ఉచిత ల్యాబ్ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, డైట్ సలహాలు, వ్యక్తిగత ఆయుర్వేద మార్గదర్శకత్వం, జీవనశైలి కౌన్సెలింగ్ వంటి సేవలను అందించడం పట్ల నిర్వాహకులను రాజేశ్వరరావు అభినందించారు. ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను భవిష్యత్తులోనూ విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమారస్వామి, రఘురాం, మాధవ్‌బాగ్ క్లినిక్స్ ప్రతినిధులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలను తీర్చడమే ప్రథమ లక్ష్యం అభివృద్ధే మా ప్రాధాన్యం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 29:**

శనివారం 125 – గాజులరామారం డివిజన్ పెద్దమ్మ నగర్ లో దాదాపు 1.12 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలను తీర్చడమే తమ ప్రథమ లక్ష్యమని, అభివృద్ధే ప్రాధాన్యతగా పనిచేస్తున్నామని అన్నారు.గత 12 ఏళ్ల కాలంలో పెద్దమ్మ నగర్ బస్తీలో త్రాగునీటి సౌకర్యం, భూగర్భ డ్రైనేజీ సదుపాయంతో పాటు అనేక సమస్యలను పరిష్కరించి నేడు సీసీ రోడ్డు పనులను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో కూడా పెద్దమ్మ నగర్ బస్తి అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, పెద్దమ్మ నగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు



దండుగుల నవీన్, ఉపాధ్యక్షులు దస్తగిరి ఖాన్, మనోహర్, ప్రధాన కార్యదర్శి రమేష్, సంయుక్త కార్యదర్శి జి ఎస్. శ్రీనివాస్, కోశాధికారి ఎండి. ఆరిఫ్, కె.రాము, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎస్. గోపాల్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, సాయిబాబా, నాగేష్, సుంకరి చందు, ఇమ్రాన్ బేగ్, చెట్ల వెంకటేష్, మూసాఖాన్, బోయిని మహేష్, చిన్న చౌదరి, బాబీ చౌదరి, ప్రసాద్, శ్రావణ్, అరుణ్, రాములు గౌడ్, శివా నాయక్, సమ్మయ్య యాదవ్, ఆసిఫ్, హమీద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అసోసియేషన్ డైరెక్టర్‌గా కావలి నర్సింహా

**మునుగోడు,ఆగస్ట్ 29 (వెలుతురు):**
తెలంగాణ పోలీస్ ఆఫీసర్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా చండూరు సర్కిల్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరెక్టర్‌గా మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కావలి నర్సింహా (పీసీ 3701) ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు,సిబ్బంది నర్సింహాకు అభినందనలు తెలిపారు.పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ,వారి సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ ద్వారా తనవంతు కృషి చేస్తానని నర్సింహా తెలిపారు.సిబ్బంది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



# ఎల్లమ్మతండాలో శ్రీ వీరాంజనే యస్వామి విగ్రహప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

- **ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని వీరాంజనేయస్వామిని మొక్కుకున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**మంచాల వెలుతురు ఆగస్టు 29:**
మంచాల మండలం ఎల్లమ్మ తండాలో గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ మందాపురం వీ రాంజనేయస్వామి గణపతి మరియు నాగదేవత విగ్రహప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి వి చ్చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారికి ఘన స్వాగతం పలికి శాలువలతో ఘనంగా సన్మానించిన మంచాల మండలం మాజీ ఎంపీపీ కాంగ్రెస్ పార్టీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెమోని జయమ్మ మల్లేష్ ముది



రాజ్ మాజీసర్పంచ్ శ్రీధర్ నాయక్ అనంతరం వీ రాంజనేయస్వామి దేవాల యంలో ప్రత్యేకపూజలు చేసి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిం చాలని మొక్కుకు న్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కార్యక్ర మంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కృషితో ఎన్నో ఏండ్ల కల... నెరవేరిన వేళ

- **సీలింగ్ భూములకు పట్టాల పంపిణీ**
- **సీఎం రేవంత్ రెడ్డి గారికి ఎమ్మెల్యే గారికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి వెంకట్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపిన రైతులు**
- **నూతనకల్,మద్దిరాల మండలాల రైతులకు తీరిన భూ సమస్యలు**
- **భూ సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం అవుతుందని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు**

**నూతనకల్ /మద్దిరాల ఆగస్టు 29 (జనంసాక్షి)**

రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాద రహిత భూములన్నిటీని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శనివారం అయన సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సంబంధించి దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న 15 గ్రామాల లోని 1061 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ళ తరబడిగా పట్టాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దాని ద్వారా వివాద రహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తాతలనాటి నుండి వస్తున్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తున్నామన్నారు.భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి నిజమైన ఆసాములకు హక్కు పత్రాలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వారు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతన 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించడం జరిగిందన్నారు.రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని,వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంవత్సరకాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదారహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని పునరుద్ఘాటించారు. పంచాయతీలేని భూములకు, భూములున్న ఆసాములు అందరికీ పట్టాలిస్తామన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇవ్వలేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నదని అన్నారు. గడచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, రానున్న రెండున్నర ఏళ్లలో కూడా అంతే రుణాలు ఇస్తామని ,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత తమదేనని మంత్రి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథం పడుతున్నారని,హైద్రాబాద్ లో కోట్ల రూపాయల విలువచేసే భూములలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి మొదటి విడత,3500,రెండో విడత 2000 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, మూడవ ,నాలుగో విడతల్లో కూడా ఇస్తామని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వెల్లడించారు .రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమా టోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల రైతుల సమస్యలకు పరిష్కారం పట్టాలు ఇవ్వడమని అన్నారు. భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని,రైతులకు రైతు భరోసా,రైతు భీమా ఇతర లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 5 లక్షల రూపాయలు ఇచ్చిన దాఖలాలు లేవని, రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపాయలతో డబుల్ త్రిబుల్ లైన్ల రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందని, మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే సూర్యాపేట నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను వేస్తామని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం, రైతు భరోసా, రైతుబంధు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లను ఎట్టి పరిస్థితులలో ఆపమని, గుడిసె ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిశెలేని తెలంగాణగా మారుస్తామని వారు అన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అని,గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కానీ రైతుల సమస్యలు పట్టాల పంపిణీతో ఇప్పుడు పరిష్కారం అయ్యాయని, తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, ప్రజలు వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ పొలాలను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేనందువల్ల ఎన్నో బాధలకు గురయ్యారని, అలాంటి 60 సంవత్సరాల సమస్య తీర్చినందుకు రెవెన్యూ మంత్రికి



రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీతో రైతులు వారి భూములకు హక్కుదారులు అయ్యారని, గతంలో కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని, భూమి అనేది రైతుకు ఆత్మ గౌరవం అని ,భూమి హక్కు లేకుంటే గుర్తింపు ఉండదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్లను మంజూరు చేయాలని, తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఇండ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ దేశంలో సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత కూడా అంతకుముందు ఉన్న వివిధ కారణాలవల్ల పట్టాలు రాని వారు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటివి రాక అనేక ఇబ్బందులు పడ్డారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇందులో భాగంగా నూతనకల్ మద్దిరాల మండలాలలోని 15 గ్రామాలలో 3000 ఎకరాలకు పైగా భూములన్ని సర్వే చేసి పరిశీలించి రైతుల పొలాల వద్దకు వెళ్లి వారికి నోటీసులు ఇచ్చిన పిదప ముసాయిదా అర్హుల జాబితాను ప్రకటించడం జరిగిందని , సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడం జరుగుతున్నదని ,ఈ రెండు మండలాలలో 1060 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు భూభారతి కింద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇస్తున్నామని, ఖాతాలు లేని వారికి కూడా కొత్తగా ఖాతాలు ఇస్తున్నట్టు వెల్లడించారు.రాష్ట్ర రెవెన్యూ,సిసి ఎల్ ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వీస్ సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు,అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ ,ఆర్డీవోలు, తహసిల్దారులు పి శ్రీనివాసరావు, తాబిత,రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, నూతనకల్ మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, ఎంపీడీవోలు సునీత, సత్యనారాయణ రెడ్డి వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.



# ఇంకో పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది

- **అసెంబ్లీ స్థానాలు పెరిగితే 120స్థానాలకు తగ్గకుండా కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**సూర్యాపేట జిల్లా వెలుతురు ఆగస్టు 29:**

మా ప్రభుత్వం ఏం చేసిందో చెప్పడానికి పెద్ద పెద్ద ప్రచారాలు అవసరం లేదు. ప్రజల మధ్యకు వెళ్లి అడిగితే వాళ్లే చెబుతారు——ఈ ప్రభుత్వం ఏం చేసిందో. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు భరోసా, రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాం. ₹5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రూ.20 వేల కోట్ల రుణమాఫీ, రూ.90వేల కోట్లతో రైతు భరోసా వంటి కార్యక్రమాలను ప్రజలే ప్రత్యక్షంగా చూస్తున్నారు. ప్రతిపక్షాలు తమ క్యాడర్‌ను తీసుకొొచ్చి ధర్నాలు చేయించవచ్చు. ప్రజా స్వామ్యంలో ధర్నాలు చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ ప్రజల తీర్పును మాత్రం ఎవరూ మార్చలేరు. ప్రజల స్పందన చూస్తుంటే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందని స్పష్టంగా తెలుస్తోంది. సీట్లు పెరిగితే 183 స్థానాల్లో 120కి తగ్గకుండా గెలుస్తాం అనే ధీమా ఉంది. ఇది కేవలం మా మాట కాదు... ప్రజల్లో కనిపిస్తున్న స్పందనపై ఉన్న విశ్వాసం. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ గారి పట్ల తెలంగాణ ప్రజలకు ఉన్న కృతజ్ఞత ఎప్పటికీ ఉంటుంది. ఆ రుణాన్ని తీర్చుకునే విధంగా ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదేళ్లు మాత్రమే కాదు... ఇంకా పది సంవత్సరాలు కూడా తెలంగాణలో కొనసాగుతుందనే నమ్మకం మాకు ఉంది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యను పరిష్కరించి, ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం చాలా సంతోషంగా ఉంది. తెలంగాణలో దశాబ్దాలుగా



పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈరోజు ఇక్కడికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చిన తీరు చూస్తే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల స్పందన ఏ స్థాయిలో ఉందో అర్థమవు తుంది. యాదాద్రి సమస్యపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రెండు రోజుల్లోనే ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తాం. మాకు రాజకీయాల కంటే ప్రజల సమస్యల పరిష్కారమే ముఖ్యం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగిస్తున్నాం.

# జిల్లాలోని పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలి. ఏఐవైఎఫ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 29:**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సెప్టెంబర్ 8, 9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయికుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో యువత శాతం అధికంగా ఉన్నప్పటికీ వారికి నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి, అందుబాటు వైద్యం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. జిల్లాలోని పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన వార్షిక క్యాలెండర్, పెండింగ్ నియామకాల పూర్తి, జిల్లాల వారీగా పరిశ్రమల ఏర్పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రైవేట్, కాంట్రాక్ట్, గిగ్ రంగాల్లో పనిచేస్తున్న యువతకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని కోరారు.యువత, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం, ఫీజుల సమస్యలు, పరీక్షల నిర్వహణలో జాప్యం, పేపర్ లీకులు, నిరుద్యోగ పోటీ పరీక్షల కోసం ఖరీదైన కోచింగ్‌పై ఆధారపడాల్సిన పరిస్థితిని




ప్రభుత్వం ముగించాలని ఆయన అన్నారు. ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, విద్యార్థి హాస్టళ్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు కల్లెం స్వామి, కార్యదర్శి రచ్చ దయాకర్, ముగ్గు మచ్చగిరి, ముగ్గు ప్రవీణ్, రచ్చ రాజేష్, ఊట్కూరి శ్రీను, ఉట్కూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవహారిక భాష ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 29:**

వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవమును5 నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ అన్ని భాషల కన్నా తెలుగు ఎంతో మధురమైనదని, చాలామంది భాషావేత్తలు తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని తెలియజేశారని అటువంటి మాతృభాష పట్ల నిరాదరణ కలిగి ఉండకూడదని అన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లా



డుతూ గ్రాంథిక భాషలో రచనలు చేయడం వల్ల సామాన్య ప్రజానీకానికి అర్థం కావని, కావున సామాన్య ప్రజలు మాట్లాడుకునే వ్యవహారిక భాషలోనే రచనలు చేయాలని వ్యవహారిక భాషా ఉద్యమాన్ని నిర్వహించడమే కాకుండా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేసిన మహనీయుడని అన్నారు. అంతేకాకుండా గ్రాంథిక భాషా వాదులపై ఒక పిడుగులాంటివాడని, భాష పట్ల ఆయనకున్న అంకితభావం చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.రత్న మంజుల ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, తెలుగు శాఖ అధ్యాపకులు అద్దంకి ఆంజనేయు లుతో పాటు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ హిందూ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 29:**

శ్రీ హిందూ కళాశాలలో ఘనంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని శ్రీ హిందూ డిగ్రీ కళాశాల రామన్నపేటలో తేదీ 29 8 2026 శనివారం రోజున శ్రీ హిందూ డిగ్రీ కళాశాల రామన్నపేటలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న తెలుగు భాషకు వారు చేసిన సేవలను గుర్తిస్తూ తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు ప్రజలమైన మనమంతా చేసుకోవడం వారికి సమర్పించే నిజమైన భాషా ప్రేమికులుగా నిలిచి మన భాషను మనం కాపాడుకోవాలి. అని శ్రీ హిందూ కళాశాల




కరస్పాండెంట్ డాక్టర్ భాస్కర్ రావు యొక్క సేవలను కొనియాడారు. వ్యవహారిక భా ష పట్ల చేసిన సేవలను గుర్తు చేసు కున్నారు అలాగే ఈరోజు దాశరధి రంగాచార్య జయంతిని కూడా జరుపుకొని తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సహస్ర అలాగే వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, సతీష్ కుమార్, శ్రీశైలం, లింగస్వామి, శ్వేత బాలరాజు, విద్యార్థిని, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ పుట్టినరోజు వేడుకలు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 29:**

హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవమును స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ హాకీ క్రీడ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి పేరు ప్రతిష్టలను సంపాదించి పెట్టిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్ చంద్ అని అన్నారు.

ఆయన జీవితం నుండి స్ఫూర్తిని పొంది




విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ ఎం. రవీందర్ రావుతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 29:**

స్థానిక మండల కేంద్రంలోని వివేకానందాస్ డివైన్ మోడల్ స్కూల్ లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థు లు,ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అలంకరించి, బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ మాట్లాడు "మన సంస్కృతి, సంప్రదాయాలను భావికు అందించ డంలో పాఠశాలల పాత్ర ఎంతో కీలకమైనది. విద్యా ర్థులకు చదువుతో పాటు మన పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడానికే ఈ వేడుక లను నిర్వహించాం. అమ్మవారి దయాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తున్నాం" అని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా



ధ్యాయులు వెలిమినేటి మల్లేష్ , ఉప ప్రధానోపాధ్యాయురాలు అస్మ, ఉపాధ్యాయులు నాగరాజు, ముత్యాలు, స్వామి, విద్యాసాగర్, సాయి, అనిత, సునీత, శాంతి, రాజేశ్వరి, సరిత ఉపాధ్యాయులు , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.



# సెప్టెంబర్ 1న కేంద్రంపై సీపీఐ రణభేరి

- **'మార్పు తప్పనిసరి' నినాదంతో ఢిల్లీలో మహా ర్యాలీ...**
- **విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాల్ పిలుపు...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఢిల్లీ చలో' మహా ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాల్ పిలుపునిచ్చారు. శనివారం జహీరాబాద్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మార్పు తప్పనిసరి' అనే నినాదంతో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి సీపీఐ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కొద్దిమంది కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని జలాల్ ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పౌరులందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కోరారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. అభివృద్ధి, ప్రాజెక్టుల పేరుతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టి వారికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**'బ్యాలెట్ తెండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి'**



ఈవీఎంల పనితీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలని సయ్యద్ జలాల్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అంశంపై కూడా సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే మహా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్‌లో CITU చారిత్రాత్మక వేతన ఒప్పందం

- **కార్మికుల ఐక్యతతోనే విజయాలు...**
- **వేతనంతో పాటు పలు సౌకర్యాల పెంపు...**
- **CITU రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని మహీంద్రా ట్రాక్టర్ పరిశ్రమలో CITU ఆధ్వర్యంలో చారిత్రాత్మక వేతన ఒప్పందాన్ని సాధించినట్లు CITU రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు తెలిపారు. వేతన ఒప్పందం కుదిరిన సందర్భంగా పరిశ్రమ వద్ద కార్మికుల గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కార్మికుల ఐక్యతతోనే పలు విజయాలు సాధ్యమవుతాయని, కార్మిక సంక్షేమమే CITU ప్రధాన ధ్యేయమని అన్నారు. కొత్త వేతన ఒప్పందం ప్రకారం ప్రస్తుత వేతనాన్ని రూ.14,761 నుంచి రూ.15,761కు పెంచినట్లు తెలిపారు. VDAను రూ.3 నుంచి రూ.3.55కు పెంచడంతో పాటు బేసిక్‌లో 50 శాతం కలిపేలా ఒప్పందం సాధించినట్లు వివరించారు. దసరా, ఆయుధ పూజ సెలవును హాఫ్‌డే నుంచి ఫుల్‌డేగా మార్చినట్లు చెప్పారు. మెడికల్ అలవెన్స్‌ను రూ.1,725 నుంచి రూ.2,100కు, షిఫ్ట్ అలవెన్స్‌ను రూ.25 నుంచి రూ.35కు పెంచినట్లు తెలిపారు. లాంగ్ సర్వీస్ అవార్డులో భాగంగా 10 ఏళ్ల సర్వీసుకు రూ.5 వేలు, 20 ఏళ్ల సర్వీసుకు రూ.10 వేలు అందించేలా ఒప్పందం కుదిరిందన్నారు. కొత్తగా హజార్డస్ అలవెన్స్ రూ.100 సాధించినట్లు పేర్కొన్నారు. గంగ్వార్ నుంచి ప్లాంట్ వరకు కార్మికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేలా ఒప్పందం జరిగినట్లు తెలిపారు.ప్రమోషన్ పాలసీలో 250 వర్కింగ్ డేస్‌ను 240కి తగ్గించడంతో పాటు 2+1 నుంచి 3+1కు పెంచి ఒక ఇంక్రిమెంట్ సాధించినట్లు చుక్క



రాములు వివరించారు. TM-3 నుంచి TM-4 గ్రేడ్‌కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. CL లీవులను 8 నుంచి 9కు పెంచడంతో పాటు GPAను రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఇంకా పలు సౌకర్యాలను కొత్త వేతన ఒప్పందంలో సాధించినట్లు తెలిపారు.కార్మికులు ఐక్యంగా ఉంటే మరిన్ని హక్కులు, సౌకర్యాలు సాధించవచ్చని చుక్క రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో CITU జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, జహీరాబాద్ క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్, మహీంద్రా అండ్ మహీంద్రా ప్రధాన కార్యదర్శి నరేష్ తదితరులు, కార్మికులు పాల్గొన్నారు.



# "పేదలకు వైద్యం అందని దుస్థితి.. ఆరోగ్య శాఖ మంత్రి రాజీనామా చేయాలి": బీజేపీ

- **పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం...**
- **వెంటనే వైద్య సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు కల్పించాలి....**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వం, ఆరోగ్య శాఖ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ మండిపడ్డారు. జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు, అవసరమైన సిబ్బంది, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల ప్రాణాలతో ముడిపడిన వైద్య వ్యవస్థ విషయంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని పూల సంతోష్ విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే పేదలకు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని ప్రభుత్వం వెంటనే గుర్తించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించడంతో పాటు ఆధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆసుపత్రుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రజలకు





నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితికి బాధ్యత వహిస్తూ ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ తరఫున పూల సంతోష్ డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందే వరకు బీజేపీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.బీజేపీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్, రాష్ట్ర నాయకులు సుదీర్ బండారి, మున్సిపల్ కౌన్సిలర్ అప్పం శ్రావణ్, సోమ అనిల్, మండల అధ్యక్షులు బంటు విశ్వనాథ్, మల్లేష్, జగన్నాథ్, నరేష్ పాటిల్, రాజ్ కుమార్, శివరాజ్, సురేష్ పూరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలపై బీజేపీ నిరసన.....



- **సీఎం దిష్టిబొమ్మ దహనం.. అడ్డుకున్న పోలీసులు... తీవ్ర ఉద్రిక్తత.. బిజెపి నేతల అరెస్ట్...**
- **ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు రేవంత్ రెడ్డి సర్కార్ ను విడిచి పెట్టం...**
- **సమస్య పరిష్కారమయ్యే వరకు విద్యార్థుల కు అండగా నిలుస్తాం..**
- **బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 29:**

విద్యార్థుల ఫీజు బకాయిల సమస్యపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం కరీంనగర్ గీతా భవన్ చౌరస్తా వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం నేతృత్వంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడానికి బీజేపీ నేతలు ప్రయత్నించగా, అక్కడికి భారీగా చేరుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బిజెపి నేతలకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల వలయాలను దాటుకుని ముందుకు వెళ్లిన బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ ..ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయాలని, విద్యార్థుల భవితతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలన్నారు. సమస్య పరిష్కారమయ్యే కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విడిచి పెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. విద్యార్థులకు బిజెపి అండగా ఉంటుందని , బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లు మాడ వెంకట్ రెడ్డి , తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి ,ఎర్రబెల్లి సంపత్ రావు ,భింగి వేణు, గుజ్జ శ్రీనివాస్ రావు , కార్యదర్శి సిహెచ్ నరసింహ రాజు. అధికార ప్రతినిధిలు బొంతల కల్యాణ్ చంద్ర ఊగులే సుధాకర్ , దుర్శెట్టి సంపత్ యువ మోర్చ అధ్యక్షులు సంగ నరేష్ ఓబీసీ మోర్చ అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఎస్టి మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ , కనుమల్ల గణపతి ఓబీసీ మోర్చ రాష్ట కార్యదర్శి అడిచెర్ల రాజు మండల , బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డీ అధ్యక్షులు మడిశెట్టి సంతోష్, మల్లేశం చింతం శ్రీనివాస్ పర్శరాములు. కోలిపాక రాజు తణుకు సాయికృష్ణ , జాడి బాలరెడ్డి,బండారి గాయత్రి,పాదం శివరాజ్, కొలకని రాజు, అవుధూర్తి శ్రీనివాస్, రాష్ట కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు దండు కొమురయ్య, ముత్యాల జగన్ రెడ్డి గాజుల స్వప్న ,మామిడి చైతన్య, ఎలుకపల్లి రమేష్, బిజిలి సారయ్య ,నక్కా ప్రమోద్ ,గంగిశెట్టి రాజు , జీడి మల్లేష్, కోలా అశోక్ కచకయల రాజు, బోయిన శ్రీనివాస్, విమల్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాల మీద అవగాహన ఉండాలి : కాంప్లెక్స్ హెచ్ఎం

**చేగుంట వెలుతురు ఆగస్టు 29:**

చేగుంట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మక్కరాజ్ పేటలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు సంబంధించి చిన్న శంకరంపేట, చేగుంట మండలాలకు సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యా ప్రమాణాల మీద, సబ్జెక్టు పై పూర్తి పరిజ్ఞానం ఉన్నప్పుడే విద్యార్థులకు బోధన చేయగలుగుతారని, కాలానుగుణంగా విద్యా వ్యవస్థలో వచ్చే మార్పులను స్వాగతించాలని, వాటికి అనుగుణంగా మన బోధనను మార్చుకోవాలని,





విద్యార్థుల స్థాయికి తగిన బోధన చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ చల్లా లక్ష్మణ్, మంగ రాణి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం

- **అజెండాలోని అన్ని అంశాలకు సభ ఆమోదం**
- **నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు – మేయర్ కొలగాని శ్రీనివాస్**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వం, సహకారంతో అభివృద్ధికి ప్రాధాన్యం**

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 29:**

కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం శనివారం ప్రశాంతమైన, సుహృద్భావ వాతావరణంలో విజయవంతంగా జరిగింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు.సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అన్ని అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. కార్పొరేటర్లు తమ తమ డివిజన్లలో నెలకొన్న ప్రజా సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలను మేయర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం





అజెండాలోని అన్ని అంశాలకు సభ ఆమోదం తెలిపింది.

**అభివృద్ధే ప్రధాన అజెండా**

కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా సమావేశంలో చర్చలు జరిగాయి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ప్రజారోగ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సభ్యులు చర్చించారు.ప్రజల నుంచి వస్తున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



**పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధి**

నగర అభివృద్ధే అందరి ఉమ్మడి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ప్రతి డివిజన్‌కు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు.

**బండి సంజయ్ కుమార్ మార్గదర్శకత్వంతో మరింత అభివృద్ధి**

కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ అందిస్తున్న మార్గదర్శకత్వం, సహకారం ఎంతో కీలకమని మేయర్ పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, నిధులను సమర్థవంతంగా వినియోగించుకొని నగరానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రధాన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు.

**"ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రథమ కర్తవ్యం" – మేయర్ కొలగాని శ్రీనివాస్**

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ..."కరీంనగర్ నగర ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత. ప్రతి డివిజన్‌ను సమాన దృష్టితో అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. కార్పొరేటర్లు ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సభ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి మార్గదర్శకత్వం, సహకారంతో కరీంనగర్‌కు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి కృషి చేస్తాం" అని అన్నారు.

**ప్రశాంతంగా ముగిసిన సమావేశం**

ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై నిర్మాణాత్మకంగా చర్చించి, అజెండాలోని అన్ని అంశాలకు సభ ఆమోదం తెలపడంతో సర్వసభ్య సమావేశం విజయవంతంగా ముగిసింది.

కరీంనగర్‌ను పరిశుభ్రమైన, సుందరమైన, ఆధునిక మౌలిక వసతులతో కూడిన నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ముందుకు సాగుతుందని మేయర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అడిషనల్ కమిషనర్లు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోగుల వాస్తవ అవసరాలు, వైద్య సేవల ఆధారంగానే పరికరాల కొనుగోళ్లు చేపట్టాలి

- **అందుబాటులో ఉన్న పరికరాలను మరమ్మతులు చేసి సత్వర వినియోగంలోకి తేవాలి**
- **హెచ్ఐవీ, ఎస్టీఐలు, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

రోగుల వాస్తవ అవసరాలు, వైద్య సేవల ఆధారంగానే పరికరాల కొనుగోళ్లు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా వైద్యాధికారులను ఆదేశించారు.శనివారం హైదరాబాద్‌లోని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రి ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంతోష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పి. శ్రీనివాస్‌లతో కలిసి ఆసుపత్రి పనితీరు, అభివృద్ధి అవసరాలపై సమీక్షించారు.సమావేశంలో వైద్య విభాగాల వారీగా అజెండాను పరిశీలించిన కలెక్టర్, వైద్య పరికరాల కొనుగోళ్లు, మరమ్మతులు, నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అవసరాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి విభాగంలో రోగుల రాకపోకలు, ప్రత్యేక వైద్య విభాగాల వారీగా కేసుల సంఖ్య, నిర్వహిస్తున్న వైద్య ప్రక్రియలు, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరికరాలు, ఇతర వనరుల వాస్తవ అవసరం, వినియోగాన్ని అంచనా వేసే విధంగా వివరాలను పరిశీలించారు.ఆసుపత్రికి కేటాయించిన బడ్జెట్, ఇప్పటివరకు చేసిన వ్యయాలను కలెక్టర్ సమీక్షించారు. ప్రతిపాదిత కొనుగోళ్లకు సంబంధించిన కారణాలు, సమర్థత, వినియోగ అవసరం, ఆవశ్యకత, ప్రాధాన్యత, అత్యవసరతపై అధికారులు స్పష్టమైన వివరాలు సమర్పించాలని ఆదేశించారు. రోగుల వాస్తవ అవసరాలు, వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా సముచితంగా కొనుగోళ్లు చేపట్టాలని, అనవసరమైన లేదా వృథా వ్యయానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇప్పటికే అందుబాటులో ఉన్న పరికరాలను సాధ్యమైన మేరకు మరమ్మతులు చేసి పునర్వినియోగంలోకి తీసుకువచ్చి, వాటిని గరిష్ఠంగా వినియోగించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొత్త పరికరాల కొనుగోలుకు ముందు ప్రస్తుత పరికరాల పరిస్థితిని పరిశీలించాలని, పరికరాల సరైన నిర్వహణ, జాగ్రత్తగా వినియోగం ద్వారా వాటి సేవా కాలాన్ని గరిష్ఠంగా పెంచాలని సూచించారు. భవిష్యత్తులో పరికరాల కొనుగోళ్ల సమయంలో తగిన వారంటీ, మరమ్మతులు, అమ్మకాల అనంతర సేవలు అందేలా నిబంధనలు ఉండేలా చూడాలని ఆదేశించారు.ఆసుపత్రిలోని విద్యుత్ పనులు, ప్లంబింగ్, పెయింటింగ్, పరిశుభ్రత, పారిశుద్ధ్యం తదితర సాధారణ సివిల్ మౌలిక వసతుల పరిస్థితిని కూడా కలెక్టర్ సమీక్షించారు. అవసరమైన చోట మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టే అంశాలపై అధికారులతో చర్చించారు.అనంతరం అక్టోబర్ 12 వరకు నిర్వహిస్తున్న ఐఈసీ ప్రచారం–2026కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులు (STI), ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు.హెచ్ఐవీ, ఎస్టీఐలు, ఎయిడ్స్‌పై ప్రజల్లో నిరంతర అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని, అవసరమైనప్పుడు ప్రజలు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి సకాలంలో వైద్య సలహా, పరీక్షలు, చికిత్స పొందాలని సూచించారు.తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (TGSACS) ఆధ్వర్యంలో ఐఈసీ (Intensified IEC) ప్రచార కార్యక్రమాలు నిర్వహించబడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు (STI), పునరుత్పత్తి మార్గ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు (RTI), సిఫిలిస్ , ఇతర అంటువ్యాధులపై అవగాహన కల్పించడం. ముఖ్యంగా హెచ్ఐవీకి గురయ్యే అవకాశం ఉన్న అధిక ప్రమాద, సున్నిత వర్గాల ప్రజలకు నివారణ చర్యలు, సురక్షిత ప్రవర్తన, ముందస్తు పరీక్షలు, చికిత్సపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, హైదరాబాద్‌లోని కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో ఐఈసీ ప్రచార కార్యక్రమాలకు సం బంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.అలాగే యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హెచ్ఐవీ /ఎయిడ్స్, ఎస్టీఐ/ఆర్టీఐ, సిఫిలిస్ వంటి వ్యాధుల నివారణకు సరైన అవగాహన ఎంతో ముఖ్యమని తెలిపారు. యువతతో పాటు సాధారణ ప్రజలకు కూడా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు.ఐఈసీ ప్రచారంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, యువత ఎక్కువగా ఉండే ప్రాంతాలు, అధిక ప్రమాద ప్రాంతాలు, సాధారణ ప్రజలలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ, నివారణపై విస్తృత ప్రచారం కొనసాగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో డా. పుట్ల శ్రీనివాస్, DMHO, ప్రోగ్రామ్ ఆఫీసర్ (హాస్పిటల్ సర్వీసెస్ అండ్ ఇన్‌స్పెక్షన్) డా. సుధీర్ కుమార్, డా. రాంబాబు నాయక్ ,CS RMO,అడిషనల్ DM&HO (AIDS & Leprosy), హైదరాబాద్ ఎన్. మురళీధర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TGMSIDC) ఇంజినీర్లు, డా. సంతోష్ బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వివిధ విభాగాల వైద్యాధికారులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, DISHA సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.




# ఎల్లమ్మతండాలో శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**మంచాల వెలుతురు ఆగస్టు 29:**

మంచాల మండలం ఎల్లమ్మతాండ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ మాందాపు రం వీ రాంజనేయస్వామి గణపతి మరియు నాగదేవత విగ్రహప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి విచ్చే సిన ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డిగారికి ఘనస్వాగతం పలికిన గ్రామసర్పంచ్ జవహర్ లాల్ మరియు మాజీడైరెక్టర్ అన సూయ గ్రామశాఖ అధ్యక్షులు సపవట్ రవి సాపావట్ చిన్న వాంజ శాలువాతో ఘనంగా సన్మా నించి దగ్గర ఉండి ప్రత్యేక పూజలు చేయించిన నాయకులు ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చీరాల రమేష్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి యాచారం మండలం మాజీ జడ్పీటిసి కర్నాటి రమేష్ గౌడ్ మాజీ ఎంపీపీ రాజు నాయక్ పిఏసిఎస్ రాజేందర్ రెడ్డి జ్ఞానేశ్వర్ జంగారెడ్డి నారి యాదయ్య రఘురాం వనపర్తి బద్రీనాథ్ పున్నం రాము సర్పంచ్ లు మంచాల రవి బుక్కన చందు ప్రకాష్ రెడ్డి కూమర్ ఐలయ్య ఎండి సోహెల్ గ్రామస్తులు పెద్దఎత్తున బిఅర్ ఎస్ పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# తిరునెల్వేలి తాటి బెల్లం కాఫీతో ఆరోగ్యానికి సహజ రుచి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

తిరునెల్వేలి తాటి బెల్లం కాఫీ ప్రత్యేకతలు తిరునెల్వేలి తాటి బెల్లం కాఫీని సంప్రదాయ పద్ధతిలో తయారు చేస్తూ, సహజ పదార్థాలతో వినియోగదారులకు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కాఫీపై ప్రచారంలో భాగంగా జీర్ణాశయ ఎంజైమ్‌ల పనితీరుకు సహాయపడుతుందని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని, శరీరంలోని వేడిని తగ్గించడంలో తోడ్పడుతుందని, కాలేయ ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.అలాగే తాటి బెల్లం సాధారణ చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చని, మధుమేహం ఉన్నవారు కూడా వైద్యుల సలహాతో తక్కువ మోతాదులో తీసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. అయితే తాటి బెల్లంలో కూడా చక్కెరలు ఉంటాయి కాబట్టి మధుమేహం ఉన్నవారు మోతాదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.బత్తుల వెంకటేష్ గౌడ్, బత్తుల నిఖిల్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ తాటి బెల్లం కాఫీని ప్రజలు ఆదరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.



# ఫీజు బకాయి – బీజేపీ లడాయి

- **రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'నిదర్శన దీక్ష'**
- **ప్రజా సమస్యలను గాలికొది లేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ లపై ధ్వజమెత్తిన బొక్క బాల్ రెడ్డి**

**శంషాబాద్, రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 29:**

రాష్ట్రంలో పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శంషాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" పేరిట భారీ 'నిదర్శన దీక్ష' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ బొక్క బాల్ రెడ్డి గారు పాల్గొని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**బొక్క బాల్ రెడ్డి గారి ఘాటు వ్యాఖ్యలు:**



- **"రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటే. ఒకరు పాలనను గాలికొదిలేస్తే, మరొకరు విపక్షంగా తమ బాధ్యతను పూర్తిగా విస్మరించారు."**
- **"40 లక్షల మంది పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణం."**
- **"గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తే, ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే రీతిలో ప్రవర్తిస్తోంది."**



"ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి శ్రేణులు శంషాబాద్ నేలపై శాంతియుతంగా పోరాటం చేస్తుంటే, ఈ రెండు పార్టీలు డ్రామాలు ఆడుతూ కాలయాపన చేస్తున్నాయి."విద్యార్థుల భవిష్యత్తు కోసం బిజెపి చేసే ఈ పోరాటం ఆగదని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో నియోజకవర్గ, జిల్లా స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా

**వెలుతురు సంగారెడ్డి ఆగస్టు 29:**

మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం కొండల్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడారు... సత్యనారాయణ స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగేష్ కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, స్థానిక నాయకులు, పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



# ఇంకో పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది

- **అసెంబ్లీ స్థానాలు పెరిగితే 120స్థానాలకు తగ్గకుండా కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**సూర్యాపేట జిల్లా వెలుతురు ఆగస్టు 29:**

మా ప్రభుత్వం ఏం చేసిందో చెప్పడానికి పెద్ద పెద్ద ప్రచారాలు అవసరం లేదు. ప్రజల మధ్యకు వెళ్లి అడిగితే వాళ్లే చెబుతారు——ఈ ప్రభుత్వం ఏం చేసిందో. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్ కార్డులు, రైతు భరోసా, రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాం. ₹5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రూ.20 వేల కోట్ల రుణమాఫీ, రూ.90వేల కోట్లతో రైతు భరోసా వంటి కార్యక్రమాలను ప్రజలే ప్రత్యక్షంగా చూస్తున్నారు. ప్రతిపక్షాలు తమ క్యాడర్‌ను తీసుకొచ్చి ధర్నాలు చేయించవచ్చు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు చేసుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ ప్రజల తీర్పును మాత్రం ఎవరూ మార్చలేరు. ప్రజల స్పందన చూస్తుంటే కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందని స్పష్టంగా తెలుస్తోంది.
సీట్లు పెరిగితే 183 స్థానాల్లో 120కి తగ్గకుండా గెలుస్తాం అనే ధీమా ఉంది. ఇది కేవలం మా మాట కాదు... ప్రజల్లో కనిపిస్తున్న స్పందనపై ఉన్న విశ్వాసం. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ గారి పట్ల తెలంగాణ ప్రజలకు ఉన్న కృతజ్ఞత ఎప్పటికీ ఉంటుంది. ఆ రుణాన్ని తీర్చుకునే విధంగా ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఐదేళ్లు మాత్రమే కాదు... ఇంకా పది సంవత్సరాలు కూడా తెలంగాణలో కొనసాగుతుందనే నమ్మకం మాకు ఉంది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యను పరిష్కరించి, ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం చాలా సంతోషంగా ఉంది. తెలంగాణలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈరోజు ఇక్కడికి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చిన తీరు చూస్తే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల స్పందన ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. యాదాద్రి సమస్యపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రెండు రోజుల్లోనే ఆ సమస్యకు పరిష్కారం చూపిస్తాం. మాకు రాజకీయాల కంటే ప్రజల సమస్యల పరిష్కారమే ముఖ్యం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉపయోగిస్తున్నాం.



# రెయిన్‌బో విస్టాస్ ఎస్టీపీ ప్లాంట్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- **దుర్వాసన, శబ్ద కాలుష్యంపై తీవ్ర ఆగ్రహం.. తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశం**

**కూకట్ పల్లి ఆగస్టు 29 వెలుతురు:**

బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని రెయిన్‌బో విస్టాస్ సమీపంలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీ) శనివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాంట్ నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వాసన, భారీ శబ్దాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన ఈ తనిఖీ చేపట్టారు.

**సమస్య ఎందుకు వస్తోంది? నిలదీసిన ఎమ్మెల్యే**

నియోజకవర్గంలోని ఫతేనగర్, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎస్టీపీ ప్లాంట్ల వద్ద లేని సమస్య ఇక్కడ మాత్రమే ఎందుకు తలెత్తుతోందని అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. స్థానికులకు అసౌకర్యం కలగకుండా సాంకేతిక లోపాలను వెంటనే సరిదిద్దాలని స్పష్టం చేశారు.

- **సమస్యను తక్షణమే గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.**
- **నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.**



పనుల్లో ఏదైనా సాంకేతిక లేదా పరిపాలనా పరమైన సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్‌లతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాభవన్‌లో మంత్రి జూపల్లికి రాఖీ కట్టిన సీతక్క

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

**రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజాభవన్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా మంత్రులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సీతక్క నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని మంత్రి జూపల్లి ఆకాంక్షించారు.**



# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 29:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర కలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో శనివారం ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు జిల్లాఎన్నికల అధికారు లు ఈఆర్ఓలు ఎఈఆర్ఓలతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ ప రిష్కార.చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా రాష్ట్రప్రధానఎన్నికలఅధికా రి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని ఫిర్యాదులు అభ్యంత రాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవం తం చేయాలని తెలిపారు నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి పెండింగ్‌లో ఉ న్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని నోటీసులు అందజే సిన రోజు నుండి7రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించా రు అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందు






బాటులో ఉంచాలని సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్ అభ్యంతరాల సందర్భంగాసమర్పించాల్సిన పత్రాలు ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారంని ర్వహించాల ని తెలిపారు క్లెయిమ్స్ అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీ కరించాలని ప్రక్రియలో పారదర్శకత జవాబు.దారీతనం పాటిస్తూ నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను స జావుగా నిర్వహించాలని తెలిపారు ప్రక్రియ కొరకు నియమించిన ఎఈఆర్ఓలకు అవసరమైన శిక్షణ అందించాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిం చి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డిమా ట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందికి సోమవారం వరకు అవసర మైన శిక్షణ అందించి శిక్షణ అనంతరం బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు ఫార్మ్‌లకు సంబంధించిన ప్రక్రియను సక్రమంగాపూర్తి చేయడంతోపాటు మండలస్థాయి వరకు పనులను సమన్వయంతో పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు ఏఈఆర్ఓ కార్యాలయాల పరిధిలో క్లస్టర్ స్థాయిలో సిబ్బందికి బాధ్యతలు కేటాయించి అవసరమైన ప్రాంతాల్లో అదనపు బృందాలను ఏర్పాటు చేసి కార్యాల యం నుంచి పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు అలాగే పోలింగ్ స్టే షన్ల పరిధిలోని ప్రాంతాల్లో అవసరమైన సమన్వయం బాధ్యతల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి ఎన్ని కల విభాగం అధికారి రవీంద్ర గుప్తా సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# వైరా రోడ్డులో నూతన ఐ.కేర్ ఆప్టికల్స్ కేంద్రం ప్రారంభం

**ఖమ్మం కార్పొరేషన్ వెలుతురు ఆగస్టు 29:**

ఖమ్మం నగరంలోని స్థానిక వైరా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ.కేర్ ఆప్టికల్స్ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ శ్రీ తుమ్మల యుగంధర్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ తుమ్మల యుగంధర్ గారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన కంటి సంరక్షణ సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. నూతనంగా ప్రారంభమైన ఐ.కేర్ ఆప్టికల్స్ కేంద్రం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు గారు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా గారు, జిల్లా నాయకులు



కమర్తపు మురళీ గారు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నాగరి తల్లి శ్రీమతి వసంతరాణి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారి ప్రగాఢ సంతాపం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 29:**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నాగరి గారి తల్లి శ్రీమతి వసంతరాణి గారి మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.శ్రీమతి వసంత రాణి గారి మరణవార్త ఎంతో బాధాకరమని పేర్కొన్న మహేష్ కుమార్ గౌడ్ గారు, ఈ దుఃఖ సమయంలో ప్రీతం నాగరి గారికి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తల్లిని కోల్పోవడం ఏ వ్యక్తి జీవితంలోనైనా తీరని విషాదమ ని, ఆ బాధను తట్టుకునే ధైర్యం, మనోబలాన్ని భగవం తుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు.దివంగత శ్రీమతి వసంతరాణి గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమెకు సద్గతి కలగాలని మహేష్ కుమార్ గౌడ్ గారు ఆకాంక్షిం చారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులందరికీ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తూ, భగవంతుడు వారికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

# నిజాంపేట్‌లో 22/A జాబితా నుంచి సర్వే నంబర్ల తొలగింపుపై హన్మంత్ రెడ్డికి కాలనీవాసుల కృతజ్ఞతలు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 29:**

నిజాంపేట్ గ్రామంలోని పలు సర్వే నంబర్ల పరిధిలోని భూములను 22/A (ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ) జాబితా నుంచి తొలగించేలా కృషి చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, నివాసితులు కలిసి ప్రత్యేకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.గత కొంతకాలంగా 22/A నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వెంకట్రాయ్ నగర్, GLN/GLS, సాయి కాలనీ, బాలాజీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా సర్వే నంబర్లు 233/4, 233/10, 233/11, 233/12తో పాటు వాటి పరిధిలోని ఇతర భూములను 22/A జాబితా నుంచి మినహాయించేలా చర్యలు తీసుకోవడంతో కాలనీవాసులకు ఎంతో ఊరట లభించింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, తమ సమస్యను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన కొలన్ హన్మంత్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వల్ల తమ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై, భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తొలగుతాయని సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను



సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మురళి, డీసీసీ జనరల్ సెక్రటరీ మౌళేశ్వర్ రావు, సర్కిల్ అధ్యక్షులు ఇందిరా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్యప్రసాద్, శ్రీదేవి , పలు కాలనీ అసోసియేషన్ల నాయకులు మరియు నివాసితులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్‌కు మరో పార్టీకి చోటు లేదు



- ప్రజల్లో ఉంటూ సేవ చేయాలనుకునే వారికే పార్టీ పదవులు ఇవ్వాలి: జగ్గారెడ్డి
- సీనియర్ నాయకుడు రామ్‌రెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి

**వెలుతురు సంగారెడ్డి వెలుతురు ఆగస్టు 29:**

సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఉందని, రానున్న పదేళ్లపాటు ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుస్తారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ప్రత్యర్థి పార్టీలు ఎన్ని వ్యూహాలు రచించినా వాటిని రాజకీయంగా తిప్పికొడతానని స్పష్టం చేశారు. సంగారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్ మండలాల పార్టీ కమిటీలను ప్రకటిస్తున్న సమయంలో జాబితాలో పేర్లు ఉన్న పలువురు నాయకులు సమావేశానికి హాజరుకాకపోవడంపై జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు రాని వారిని కమిటీల నుంచి తొలగించి, సమావేశాలకు హాజరయ్యే నాయకుల పేర్లను చేర్చాలని కమిటీ అధ్యక్షులను ఆదేశించారు. ఇంట్లో కూర్చొని రాజకీయాలు చేసేవారికి కాకుండా ప్రజల్లో ఉంటూ సేవ చేయాలనే తపన, రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారికే మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీల్లో పదవులు ఇవ్వాలని సూచించారు.

## సీనియర్ కార్యకర్తలకు గుర్తింపు

ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పదవులు దక్కకుండా మిగిలిపోయిన నాయకులు, కార్యకర్తలు ఉంటే వచ్చే శనివారం జరిగే సమావేశానికి వారి పేర్లను ఇవ్వాలని జగ్గారెడ్డి కోరారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన సామాన్య కార్యకర్తలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించానని తెలిపారు.కలివేముల రామ్‌రెడ్డి సుమారు 70 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకుడని పేర్కొన్న జగ్గారెడ్డి, ఆయనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కల్పిస్తున్నట్లు ప్రకటించారు. రామ్‌రెడ్డికి ఒక సంవత్సరం, అశోక్‌రెడ్డికి మరో సంవత్సరం చొప్పున మార్కె ట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు తెలిపా రు. ఏళ్ల తరబడి పార్టీలో కొనసాగుతున్న కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు ఉండాలని అన్నారు.

## డబ్బుతోనే రాజకీయాలు గెలవలేరు

రాజకీయాల్లో డబ్బు ఉంటేనే గెలవగలమనే అభిప్రాయం వాస్తవం కాదని జగ్గారెడ్డి అన్నారు. తాను డబ్బులు లేకుండానే కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, అనంతరం మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని తెలిపారు. ప్రజల్లో ఉంటూ నిరంతరం సేవ చేస్తేనే రాజకీయంగా ఎదగవచ్చన్నారు. సాధారణ సమయంలోనూ ఆపదలో ఉన్న వారికి రాజకీయాలకు అతీతంగా ఆర్థిక సహాయం చేశానని చెప్పారు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో డబ్బు పనిచేస్తుందని, అయితే ప్రతిసారీ అది పనిచేయదని వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, రాజకీయాలపై ఆసక్తి, ప్రజల్లో నిరంతరం ఉండాలనే లక్షణాలు ఉన్నవారిని మాత్రమే పార్టీ కమిటీల్లోకి తీసుకోవాలని సూచించారు.

## ఇంకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటా

తాను మరో 20 ఏళ్లపాటు రాజకీయాల్లో కొనసాగుతానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో పార్టీని తాను ఒక ప్రత్యేక ప్రణాళికతో బలోపేతం చేశానని పేర్కొన్నారు. తన మాటకు గౌరవం ఇచ్చి, తనతో కలిసి పనిచేసే వారు నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది ఉన్నారని అన్నారు. పండుగలు, పబ్బాలు నిర్వహించడం, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం తదితర కారణాలతో తనను అభిమానించే వారు సంగారెడ్డిలో ఉన్నారని తెలిపారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి తప్ప మరో పార్టీకి అవకాశం లేకుండా పనిచేస్తానని జగ్గారెడ్డి అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య నిర్మల, ఆ తర్వాతి ఎన్నికల్లో ఆంజనేయులు పోటీ చేస్తారని పేర్కొన్నారు. తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు కంటే, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మరింత కసితో పనిచేస్తానని చెప్పారు. ప్రత్యర్థులు ఎన్ని వ్యూహాలు రచించినా వాటిని తిప్పికొడతానని, ప్రత్యర్థులు ఎంత ప్రయత్నించినా తాను రూపొందించిన రాజకీయ ప్రణాళిక ముందు వారి వ్యూహాలు పనిచేయవని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనంత కిషన్, చేర్యాల ఆంజనేయులు, కూన సంతోష్, కిరణ్ గౌడ్ జార్జ్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బూటకపు హామీలపై సమరశంఖం: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- సెప్టెంబర్ 2 నుంచి డివిజన్ల వారీగా నిరసన సభలు.. ఇంటింటికీ 'బాకీ కార్డులు' పంపిణీకి పిలుపు

**కూకట్ పల్లి ఆగస్టు 29 వెలుతురు:**

ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, బూటకపు 6 గ్యారంటీల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలో రాజీలేని పోరాటం చేయాలని కూకట్‌పల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలోని కార్యాలయంలో నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నేతలతో నిర్వ హించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

## సెప్టెంబర్ 2 నుంచి నిరసన కార్యాచరణ

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 2 నుంచి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ప్రజావేశాలు, నిరసన కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

**డివిజన్ల వారీగా సమావేశాల షెడ్యూల్:**

- **సెప్టెంబర్ 2: బోయిన్‌పల్లి డివిజన్**
- **సెప్టెంబర్ 4: బాలానగర్ డివిజన్**
- **సెప్టెంబర్ 5: బేగంపేట్ (ఓల్డ్ బోయిన్‌పల్లి) డివిజన్**
- **సెప్టెంబర్ 6: ఫతేనగర్ డివిజన్**
- **సెప్టెంబర్ 7: మూసాపేట్ డివిజన్**
- **సెప్టెంబర్ 8: అల్లాపూర్ డివిజన్**
- **సెప్టెంబర్ 9: బాలాజీనగర్ & కేపీహెచ్‌బీ డివిజన్లు (సంయుక్తంగా)**
- **సెప్టెంబర్ 10: కూకట్‌పల్లి డివిజన్**

ఇంటింటికీ 'బాకీ కార్డులు'

కాంగ్రెస్ పార్టీ అమలు చేయని హామీలను గుర్తుచేస్తూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ



'బాకీ కార్డులు' చేరేలా కార్యాచరణ రూపొందించాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి వచ్చేందుకు ప్రజలను మోసం చేసిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని, డివిజన్ స్థాయి సమావేశాలను విజయవంతం చేసి ప్రజా చైతన్యాన్ని రగిలించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, తూము శ్రవణ్ కుమార్, పందాల సతీష్ గౌడ్, పగడాల బాబూరావు, ఎండి సబీహా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# 22A నిబంధనపై బాధితుల గళం.. బీరంగూడలో వెల్లువెత్తిన ప్రజా ఆగ్రహం

- మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో 500 బైకులతో జీఎంఆర్ కన్వెన్షన్ వరకు భారీ ర్యాలీ
- బాధితులను ఏకం చేసి ఉద్యమ స్ఫూర్తి నింపిన నరసింహ గౌడ్‌ను ప్రశంసించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- 22A నిబంధనను ఎత్తివేసేంత వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు: హరీష్ రావు

**అమీన్‌పూర్, వెలుతురు ఆగస్టు 29:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివాదాస్పద 22A నిబంధనతో సామాన్య ప్రజలు, రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని, బాధితుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, పటాన్‌చెరు



ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.పటాన్‌చెరు పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో 22A సమస్యపై నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ డివిజన్ నుండి వందలాది మంది బాధితులతో కలిసి సుమారు 500 బైకులతో చేపట్టిన భారీ బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గులాబీ జెండాలతో, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీరంగూడ నుండి జీఎంఆర్ కన్వెన్షన్ వరకు సాగిన ఈ ర్యాలీతో రహదారులు గులాబీమయమయ్యాయి.



## బాధితులకు అండగా నందారం నరసింహ గౌడ్.. నేతల అభినందనలు:

జీఎంఆర్ కన్వెన్షన్ వేదికగా మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "22A నిబంధన తీవ్రతను, దానివల్ల ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నందారం నరసింహ గౌడ్ చూపిన చొరవ అభినందనీయం. బాధితులందరినీ ఏకం చేసి, ఇంతటి భారీ ఎత్తున 500 బైకులతో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి ప్రజా చైతన్యం కల్పించడం గొప్ప విషయం" అని ప్రత్యేకంగా కొనియాడారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. "భూమి మా హక్కు – బతుకు మా హక్కు" అని, ప్రజలు కష్టపడి సంపాదించుకున్న భూములకు 22A పేరుతో రిజిస్ట్రేషన్లు ఆపడం కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి ప్రజల కష్టార్జితాన్ని లాక్కునే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రభుత్వం మెడలు వంచైనా 22Aను ఎత్తివేయిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ జి యువసేన సభ్యులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, 22A బాధితులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సూరారం గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత.. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- హుజురాబాద్–హనుమకొండ మధ్య సూరారం మీదుగా బస్సు నడిపేందుకు ఆదేశాలు
- సూరారం - పొలాడ్ పల్లి మధ్య బ్రిడ్జి, రోడ్ల అభివృద్ధికి చర్యలు
- గ్రామంలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం
- ప్రజా పాలనలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

**ఎల్కతుర్తి వెలుతురు ఆగస్టు 29:**
హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి మండలం, సూరారం గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న– పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించిన మంత్రి.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజా పాలనలో సూరారం గ్రామానికి అందిన సంక్షేమ ఫలాలు ప్రగతి నివేదిక

ప్రజా పాలన ప్రభుత్వంలో సూరారం గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరిందని మంత్రి తెలిపారు.

- గ్రామంలో 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి.
- 475 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందుతుండగా, రూ.1.11 కోట్లు విడుదల అవుతున్నాయి.
- గృహజ్యోతి పథకం ద్వారా 665 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించి రూ.63.96 లక్షల లబ్ధి చేకూరింది.
- మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 535 కుటుంబాలకు రూ.10.08 లక్షలు విడుదలయ్యాయి.
- 71 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.50.92 లక్షలు అందాయి.
- 71 మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.10.37 కోట్లు విడుదలయ్యాయి.
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మూడు మహిళా సంఘాల ద్వారా 1,200 స్టీల్ బ్యాంక్ కిట్లు పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో 13 రకాల వస్తువులు ఉన్నాయి.
- 340 మంది రైతులకు రూ.2.87 కోట్లు రైతు రుణమాఫీ కింద విడుదలయ్యాయి.
- 973 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.4.83 కోట్లు అందాయి.
- 8 మంది రైతుల కుటుంబాలకు రైతు బీమా కింద రూ.40 లక్షలు అందించారు.
- 217 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.62.18 లక్షలు విడుదలయ్యాయి.
- 47 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, 5 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు అందించారు.
- గ్రామంలో 158 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.
- గ్రామంలోని 3,380 యూనిట్లకు సన్న బియ్యం పంపిణీ జరుగుతోంది.
- మహిళలకు 1,022 ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.



### సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు మంజూరు

సూరారం గ్రామానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్, ప్రజలు చేసిన విజ్ఞప్తిపై మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించారు. గ్రామానికి బస్సు మంజూరు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. హుజురాబాద్–హనుమకొండ మధ్య సూరారం మీదుగా బస్సు నడిపించాలని ఆదేశించగా, రెండు రోజుల్లో బస్సు సర్వీసును ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

### రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి హామీ

సూరారం గ్రామంలో విద్యుత్ సరఫరా, తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కొత్త కాలనీలకు విద్యుత్ స్తంభాలు, అంగన్వాడీ భవనాలు తదితర సమస్యలను గ్రామ సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.గ్రామంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సూరారం – పొలాడ్ పల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, సూరారం నుంచి వీరనారాయణపూర్ వరకు రోడ్డు పూర్తి చేస్తామని తెలిపారు.హైవే నుంచి సూరారం వరకు రహదారి పనులను పూర్తి చేస్తామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపడతామని మంత్రి పేర్కొన్నారు.జాతీయ రహదారికి సంబంధించిన గ్రామ ప్రజల రాకపోకల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నడుచుకుంటూ వెళ్లే ప్రజల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు.గ్రామంలో ఇప్పటి వరకు సుమారు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలిన అవసరమైన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

### పెన్షన్లకు ఈ నెల 31 వరకు దరఖాస్తులు

కొత్త పెన్షన్ల కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు కూడా దృష్టి సారించాలని కోరారు.ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకుని భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని జలసిరి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

### ప్లాస్టిక్‌కు స్వస్తి.. స్టీల్ బ్యాంక్‌ను వినియోగించాలి

ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల గ్రామాల్లో స్టీల్ బ్యాంక్‌లను వినియోగించాలని మంత్రి కోరారు. సూరారం గ్రామంలో మూడు మహిళా సంఘాలకు 400 చొప్పున మొత్తం 1,200 స్టీల్ బ్యాంక్ కిట్లు అందించామని తెలిపారు. గ్రామంలోని హోటళ్లకు కూడా ఒక్కొక్కరికి 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు వెల్లడించారు.

### విద్య, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని మంత్రి సూచించారు. 14–15 సంవత్సరాల వయసున్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు.నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించామని, గ్రామానికి క్రీడా సామగ్రి అందించామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్ల ద్వారా భవిష్యత్‌లో ఇండియన్ ఆర్మీ,



పోలీస్ శాఖతో పాటు ఇతర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు.హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఇప్పటికే కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేశామని, సూరారం గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

### రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ.. ఎవరి పైరవీలు అవసరం లేదు

గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు.సూరారం గ్రామంలో కొత్తగా 158 రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు 1,230 పేర్లను కొత్తగా చేర్చామని వెల్లడించారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

### ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి

గ్రామంలో సుమారు 500 ఓట్లు తటస్థంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూసుకోవాలని సూచించారు.తన ఓటుకు కూడా తటస్థ ఓటు నోటీసు వచ్చిందని, తన తండ్రి పేరు సత్తయ్యకు బదులుగా సత్యనారాయణగా నమోదైందని మంత్రి తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు.

గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ భాషబోయిన నీల – కొమురయ్య, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దండేపల్లి గ్రామ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- దండేపల్లి గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం, వివో భవనం, పలు రోడ్లు మంజూరు
- పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దండేపల్లిలో పర్యటన లో మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజల సమక్షంలో సంక్షేమం, అభివృద్ధిపై అధికారులతో సమీక్ష - సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు

**హనుమకొండ జిల్లా, వెలుతురు ఆగస్టు 29:**
ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమక్షంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వినతి పత్రాలను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ప్రజా పాలన ప్రభుత్వంలో దండేపల్లి గ్రామ ప్రగతి నివేదిక

**ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దండేపల్లి గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరిందని అధికారులు వివరించారు.**

- 31 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అధిక శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయింది. త్వరలో రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి.
- 475 మందికి పెన్షన్లు అందుతుండగా, రూ.1.14 కోట్ల మేర నిధులు విడుదలవుతున్నాయి.
- గృహ జ్యోతి పథకం ద్వారా 693 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.59.83 లక్షల లబ్ధి చేకూరింది.
- మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 529 కుటుంబాలకు రూ.10.08 లక్షలు విడుదలయ్యాయి.
- 64 మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.29.88 లక్షలు, బ్యాంకు లింకేజీ కింద రూ.8.60 కోట్లు విడుదలయ్యాయి.
- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి 900 కిట్ల చొప్పున 13 రకాల వస్తువులు అందించారు.
- 332 మంది రైతులకు రూ.2.88 కోట్లు రైతు రుణమాఫీ కింద లబ్ధి చేకూరింది.
- 1,033 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.5.28 కోట్లు అందాయి.
- రైతు బీమా కింద 7 మంది రైతుల కుటుంబాలకు రూ.35 లక్షల విలువైన చెక్కులు అందించారు.
- 428 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.81.07 లక్షలు విడుదలయ్యాయి.
- 55 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఒకరికి షాదీ ముబారక్ చెక్కులు అందించారు.
- 114 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.
- గ్రామంలో 3,238 యూనిట్లకు సన్న బియ్యం పంపిణీ జరుగుతోంది.
- భూభారతి కింద నమోదైన 9 దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

### దండేపల్లి అభివృద్ధికి పలు కీలక హామీలు

గ్రామ సర్పంచ్ గులిపల్లి సంపత్ గ్రామంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, అంగన్వాడీ భవనం వంటి అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు రూ.58 లక్షల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి స్థలం సిద్ధంగా ఉందని సర్పంచ్ కోరగా, అదే స్థలంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని వెంటనే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వివో భవన నిర్మాణానికి రెండు గుంటల స్థలాన్ని దానం చేసిన శంకర్ నారాయణను మంత్రి అభినందించారు. ఇప్పటికే ఒక వీఓ భవనం మంజూరు కాగా, దానం చేసిన స్థలంలో మరో రెండు వీజీఓ భవనాలను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.దండేపల్లి గ్రామానికి సంబంధించిన రహదారి సమస్యలపై మంత్రి కీలక ప్రకటనలు చేశారు.

- వీరనారాయణపూర్–దండేపల్లి బ్రిడ్జి రోడ్డు మంజూరైంది.
- దండేపల్లి–సూరారం–ఎల్కతుర్తి రోడ్డు మంజూరు చేస్తామని ప్రకటించారు.
- గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అంతర్గత సీసీ రోడ్లను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.
- ఎల్లమ్మ ఆలయం, పోచమ్మ ఆలయం వైపు రోడ్ల అభివృద్ధితో పాటు అంబేద్కర్ వరకు మంజూరైన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
- గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాలువ పనులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
- మంచినీటి బావి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
- దశాబ్దాల తర్వాత దండేపల్లికి బస్సు సౌకర్యం వచ్చిందని, ఆదివారం కూడా బస్సు నడిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని కోరారు.జలసిరి పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ప్లాస్టిక్‌కు స్వస్తి - స్టీల్ బ్యాంక్‌కు ప్రోత్సాహం

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను విస్తృతంగా వినియోగించాలని మంత్రి సూచించారు. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని పేర్కొన్నారు.దండేపల్లి గ్రామంలో మూడు మహిళా సంఘాల ఆధ్వర్యంలో 900 స్టీల్ బ్యాంక్ కిట్లను, 13 రకాల వస్తువులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో హోటల్‌కు 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు చెప్పారు.

### అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు అర్హులైన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థులు,



యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని సూచించారు. వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పాల్గొనాలని చెప్పారు. క్రీడల్లో రాణిస్తే సర్టిఫికెట్ల ద్వారా ఆర్మీ, పోలీస్ తదితర ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని తెలిపారు.నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా కారుడు కృష్ణను నియమించామని, గ్రామంలో క్రీడా సామ గ్రిని అందిస్తున్నామని చెప్పారు. హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఇప్పటికే కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దండేపల్లి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

### మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

14–15 సంవత్సరాల వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకాలు వేయించాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి

పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్ల వరకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని వివరించారు.మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందిస్తూ, వారు ఆర్థికంగా ఎదిగేందుకు రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచు తున్నామని తెలిపారు.ప్రజల సమస్యలను స్వయంగా విని, అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దండేపల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ గులిపల్లి సంపత్, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

# ఇందిరా నగర్‌ను ఎల్కతుర్తి మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- మీ సమస్య నా సమస్య.. మీ గ్రామ అభివృద్ధి నా బాధ్యత: మంత్రి పొన్నం ప్రభాకర్

**హనుమకొండ జిల్లా, వెలుతురు ఆగస్టు 29:** హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలంలోని ఇందిరా నగర్ గ్రామాన్ని ఎలకతుర్తి మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు."పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా శనివారం ఇందిరా నగర్ గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

### ఇందిరా నగర్ గ్రామ ప్రగతి నివేదిక

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరా నగర్ గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరిందని మంత్రి తెలిపారు.

- **44 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చాలావరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి.**
- **96 మందికి పెన్షన్లు అందుతున్నాయి. వీటి కోసం రూ.6.32 లక్షలు విడుదల చేస్తున్నారు.**
- **గృహ జ్యోతి పథకం ద్వారా 66 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ రూ.10.08 లక్షల లబ్ధి చేకూరింది.**
- **మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 15 కుటుంబాలకు రూ.7.27 లక్షలు విడుదలయ్యాయి.**
- **20 మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.10.09 లక్షలు విడుదలయ్యాయి.**
- **41 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.6.20 కోట్ల రుణాలు అందాయి.**
- **ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, 13 రకాల వస్తువులతో అందించారు.**
- **52 మంది రైతులకు రూ.37.61 లక్షల రైతు రుణమాఫీ లబ్ధి చేకూరింది.**
- **235 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.93.04 లక్షలు అందాయి.**
- **52 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.10.57 లక్షలు విడుదలయ్యాయి.**
- **6 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందించారు.**
- **గ్రామంలో 69 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.**
- **382 రేషన్ కార్డులకు సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది.**

ఇందిరా నగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

ఇందిరా నగర్ గ్రామం ఇందిరా గాంధీ పేరు మీద ఏర్పడిన గ్రామం కావడం తనకు ప్రత్యేక గౌరవంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రామ ప్రజలు కోరిన విధంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వంలో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో కొన్ని సమస్యలు పేరుకుపోయాయని, ఇకపై సంక్షేమం, అభివృద్ధి రెండూ ప్రతి అర్హ కుటుంబానికి సమానంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని మంత్రి సూచించారు.ఇందిరమ్మ ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘ భవనం వంటి మౌలిక వసతుల




అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

### నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

జలసిరి పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి ప్రజలకు సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షలు అందిస్తుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

### ప్లాస్టిక్‌కు దూరంగా.. స్టీల్ బ్యాంక్‌ను వినియోగించాలి

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గ్రామాల్లో స్టీల్ బ్యాంక్‌లను విస్తృతంగా వినియోగించాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వల్ల ఆరోగ్యానికి హాని కలిగే అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా క్యాన్సర్ వంటి వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరా నగర్‌లో మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, 13 రకాల వస్తువులతో అందించామని, హోటళ్లకు ఒక్కొక్కటికి 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు మంత్రి తెలిపారు.

### అర్హులందరికీ పెన్షన్లు

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, HIV బాధితులు తదితర అర్హులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందని కుటుంబాల వివరాలను అధికారులు సేకరించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ

14–15 సంవత్సరాల వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న టీకాలను వేయించాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని, గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

### యువత క్రీడల వైపు అడుగులు వేయాలి

యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. వాలీబాల్, కబడ్డీతో పాటు ఇతర క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించామని, గ్రామంలో క్రీడా సామగ్రిని అందించినట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు రావడంతో పాటు, క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు.ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేశామని తెలిపారు.

### మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని మంత్రి అన్నారు. మహిళా సంఘాల సభ్యులు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునేలా రుణ పరిమితులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుకునే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.మహిళా సంఘాలు బలపడితే గ్రామ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని అన్నారు.

### సౌర విద్యుత్‌తో కుటుంబాలకు ప్రయోజనం

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని వివరించారు.గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేదని, ప్రజాపాలనలో అర్హులైన వారికి రేషన్ కార్డులు అందిస్తున్నామని మంత్రి తెలిపారు."మీ సమస్య నా సమస్య.. మీ గ్రామ అభివృద్ధి నా బాధ్యత"గ్రామంలో ఉన్న సమస్యలను సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు."నా నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం అభివృద్ధి చెందినట్లు భావిస్తాను. ఏ గ్రామం పట్లా వివక్ష లేకుండా సమానంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని మంత్రి స్పష్టం చేశారు.ఈ 32 నెలల ప్రజా ప్రభుత్వ కాలంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇందిరా నగర్ గ్రామానికి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. "మీ సమస్య నా సమస్య.మీ గ్రామ అభివృద్ధి నా బాధ్యత. మన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత." అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం

- వల్భాపూర్ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

**హనుమకొండ జిల్లా వెలుతురు ఆగస్టు 29:** హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలంలోని వీర వల్భాపూర్ గ్రామంలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామూహిక సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### వల్భాపూర్ గ్రామ ప్రగతి నివేదిక

ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధి వివరాలను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

- **గ్రామంలో 13 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చాలావరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగనుంది.**
- **233 మందికి పెన్షన్లు అందుతుండగా, రూ.5.55 లక్షలు విడుదల అవుతున్నాయి.**
- **గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో 349 కుటుంబాలకు రూ.34.07 లక్షల లబ్ధి చేకూరింది.**
- **మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ ద్వారా 331 కుటుంబాలకు రూ.6.72 లక్షలు విడుదలయ్యాయి.**
- **41 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.32.38 లక్షలు విడుదలయ్యాయి.**
- **41 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.6.20 కోట్ల రుణాలు అందాయి.**
- **87 మంది రైతులకు సన్న వడ్ల బోనస్ కింద రూ.24.87 లక్షలు విడుదలయ్యాయి.**
- **24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు.**
- **56 కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు.**

### గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు

గ్రామ ప్రజలు కాలువ నిర్మాణం పూర్తి చేయడం, మహిళా సంఘాల భవనానికి స్థల సమస్య పరిష్కరించడం, వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, సర్వీస్ రోడ్డు విస్తరణ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.వీటిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### మహిళా భవనానికి స్థల సమస్య వెంటనే పరిష్కరించాలి

వల్భాపూర్ గ్రామంలో మహిళా భవనానికి స్థల సమస్య చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని మంత్రి తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. స్థల సమస్య పరిష్కారం కాగానే మహిళా భవనాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

### నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

జలసిరి పథకం కింద ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500 అందిస్తుందని, పొలం కుంటకు రూ.1.30 లక్షలు అందిస్తుందని తెలిపారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

### ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని కోరారు.

### ప్లాస్టిక్‌కు బదులు స్టీల్ బ్యాంక్ వినియోగించాలి

ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామాల్లో స్టీల్ బ్యాంక్‌లను వినియోగించుకోవాలని, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి నష్టం కలుగుతుందని తెలిపారు.వల్భాపూర్ గ్రామంలో మూడు మహిళా సంఘాలకు 300 స్టీల్ బ్యాంక్ కిట్లు, ఒక్కో కిట్‌లో 13 రకాల వస్తువులు అందించినట్లు తెలిపారు. గ్రామంలోని హోటళ్లకు కూడా ఒక్కొక్కరికి 100 స్టీల్ గ్లాసులు అందించామని చెప్పారు.

### అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ బాధితులు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

14–15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందుబాటులో ఉన్న టీకాను వేయించాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించినట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో క్రీడా సామగ్రిని అందించామని చెప్పారు.క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే మంచి గుర్తింపుతో పాటు సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అన్నారు. ముఖ్యంగా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖల్లో ఉద్యోగ అవకాశాలకు క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు.విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా మైదానాలకు వెళ్లి వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడలు ఆడాలని సూచించారు. ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేశామని తెలిపారు.

### మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అండ




మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

### రేషన్ కార్డుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

గతంలో రేషన్ కార్డు కోసం ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని మంత్రి అన్నారు. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

### సోలార్ విద్యుత్‌ను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి

పీఎం సూర్యఘర్ పథకం కింద ఇంటిపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇంటికి అవసరమైన విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని చెప్పారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, అధికారులను ప్రజల వద్దకు తీసుకువచ్చి పరిష్కారం చూపడమే "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ

ఈ భేటీలో పరిపాలన, టూరిజం, ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, నైపుణ్యాభివృద్ధి, విద్యా తదితర రంగాల్లో 'తెలంగాణ – మారిషస్' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలు, కార్యాచరణపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. ఆనతికాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న 'తెలంగాణ'ను దేశం అత్యంత నమ్మకమైన భాగస్వామిగా పరిగణిస్తోందని ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియా పేర్కొన్నారు. మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునిక పరిపాలనా విధానాలపై కి శిక్షణ ఇచ్చేందుకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. అలాగే... రాష్ట్రంలోని ఎంసీహెచ్‌ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇతర ప్రముఖ విద్యాసంస్థలతోనూ పనిచేసేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ మారిషస్ కు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అంతర్జాతీయ భాగస్వా



మ్యాకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డిసెంబర్ 7,8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026"లో పాల్గొనాలని మంత్రి లుచ్ మనన్ పెంతియాను ఆహ్వానించారు. సమావేశంలో సెక్రటరీ ఫర్ పబ్లిక్ సర్వీస్ దేవేంద్ర గోపాల్, అటల్ బిహారీ వాజ్ పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ ఇన్నోవేషన్ (ఏఐపీఎస్ఐ) బోర్డ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రాగో డూ, ఏఐపీఎస్ఐ రిజిస్ట్రార్ డా. రమేష్ దుర్బరీ, ఎంఈఏ బ్రాంచ్ సెక్రటేరియట్ హెడ్ మాధవ్ ఆర్. సుల్ఫులే, పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

# మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసిన కాంగ్రెస్ - సంక్షేమంతో సాధికారత కల్పించిన మోదీ ప్రభుత్వం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు

- **మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశంలో దిశానిర్దేశం**
- **కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాల్లో 22 నుండి 37 శాతం లబ్ధిదారులు మైనారిటీలే**
- **సిఎఎ (CAA) చట్టంపై దుష్ప్రచారం చేసి అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర**
- **వందేమాతరం దేశభక్తికి ప్రతీక.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని కించపరచవద్దు**

**మహబూబ్ నగర్ వెలుతురు ఆగస్టు 29:**

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, ఎన్ని కులాలు, మతాలు ఉన్నా మనమందరం భారతీయులుగా ఐక్యంగా జీవించడమే ఈ దేశ గొప్పతనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డి.కె. అరుణ గారితో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు గారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటూ సమాజంలో విభజన రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. దేశంలో అత్యధిక మత ఘర్షణలు (Communal Riots) కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో, వారి హయాంలోనే జరిగాయని చారిత్రక వాస్తవాలను గుర్తుచేశారు. వాజ్‌పేయి గారి హయాం నుండి నేటి నరేంద్ర మోదీ గారి 12 ఏళ్ల పాలన వరకు బీజేపీ ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడుతూ, 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ముద్రా, జన్ ధన్, ఉజ్వల, ఉడాన్ వంటి ప్రతి సంక్షేమ పథకంలో 22 శాతం నుండి 37 శాతం వరకు లబ్ధిదారులు మైనారిటీ వర్గాల వారే ఉండటం మోదీ ప్రభుత్వ సమన్యాయ పాలనకు నిదర్శన మన్నారు. ఏటా మైనారిటీ విద్యార్థులకు భారీగా స్కాలర్‌షిప్‌లు అందించడంతో పాటు, ముస్లిం యువత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (IAS, IPS) పరీక్షల్లో రాణించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తోందని తెలిపారు.పౌరసత్వ సవరణ చట్టం (CAA) పై కాంగ్రెస్ పార్టీ కల్పించిన అపోహలను రాంచందర్ రావు గారు తీవ్రంగా ఖండించారు. దేశ విభజన సమయంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఉండిపోయిన హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు.. అక్కడ మత చాందసవాదుల చేతుల్లో బలవంతపు మతమార్పిడులు, అణచివేతకు గురై భారత్‌కు శరణార్థులుగా వచ్చారని వివరించారు. పాకిస్తాన్ తొలి న్యాయశాఖ మంత్రి జోగేంద్రనాథ్ మండల్ సైతం అక్కడ వివక్షను తట్టుకోలేక భారతదేశానికి తిరిగి రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులు ఎదుర్కొని మన దేశానికి వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించే చట్టం సిఎఎ అని స్పష్టం చేశారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి, డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటన సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ దీనికి మత రంగు పూసి అల్లర్లు సృష్టించే కుట్ర చేసిందని ఆరోపించారు.నిజాం నిరంకుశ పాలనపై హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ వంటి దేశభక్తులు సైతం 'వందేమాతరం' నినదిస్తూ ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. వందేమాతరం ఏ మతానికీ వ్యతిరేకం కాదని, అది పవిత్రమైన భరతమాతను గౌరవించే జాతీయ గేయమని పేర్కొన్నారు. 1937లో ముస్లిం లీగ్‌కు భయపడి మొదటి రెండు చరణాలకే పరిమితం చేసిన కాంగ్రెస్, నేడు కేరళలో జమాతే ఇస్లామీ, తెలంగాణలో మజ్లిస్ (AIMIM) పార్టీల ఓటు బ్యాంకుకు భయపడి వందేమాతరాన్ని వ్యతిరేకిస్తూ దేశభక్తిని అవమానిస్తోందని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వంలో మాత్రమే మైనారిటీలకు నిజమైన రక్షణ, విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో సమాన అవకాశాలు అందుతున్నాయని, ఈ వాస్తవాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని మైనారిటీ మోర్చా శ్రేణులకు రాంచందర్ రావు గారు పిలుపునిచ్చారు.రాష్ట్రంలో కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని రామచందర్ రావు గారు తీవ్రంగా విమర్శించారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు కార్లు, గన్‌మెన్లు, కార్యాలయాలు ఇవ్వడానికే పరిమితమయ్యారని, మైనారిటీల అభివృద్ధికి మాత్రం ఒక్క రూపాయి నిధులు కేటాయించడం లేదని మండిపడ్డారు. మైనారిటీ గురుకులాలు, హాస్టళ్లు సరైన వసతులు లేక అధ్వాన స్థితికి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా మరియు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా మైనారిటీ యువతకు వేలాదిగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే, రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రం ఓట్ల కోసమే మైనారిటీల పేరును వాడుకుంటోందని స్పష్టం చేశారు. అధికారంలో ఎవరున్నా వారికి వత్తాసు పలికే మజ్లిస్ (AIMIM) పార్టీ ఆనాడు బీఆర్ఎస్‌తో, నేడు కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుందని, బీజేపీ పోరాటం వల్లే పాతబస్తీకి మెట్రో మంజూరైందని గుర్తుచేశారు.హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు కుమ్మక్కై మజ్లిస్ అభ్యర్థిని గెలిపించాయని ఆయన గుర్తుచేశారు. నేడు అదే మజ్లిస్ ఎమ్మెల్సీ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు



ఎందుకు నోరు మెదపడం లేదని, వారి మధ్య ఉన్న అంతర్గత ఒప్పందం ఏమిటని రామచందర్ రావు గారు సూటిగా ప్రశ్నించారు.ప్రధాని నరేంద్ర మోదీ గారికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE), ఈజిప్ట్, బహ్రెయిన్, జోర్డాన్ వంటి ప్రముఖ ఇస్లామిక్ దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలు అందించి గౌరవిస్తుంటే, విపక్షాలు మాత్రం రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాయమాటలను నమ్మవద్దని, తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ.. మోదీ గారి సంక్షేమ ఫలాలను గ్రామాలు, మండలాల వారీగా ఇంటింటికీ చేరవేసి రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని మైనారిటీ మోర్చా శ్రేణులకు పిలుపునిచ్చారు.



# SIRపై ఈసీకి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ

తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా భారత ఎన్నికల సంఘం (ECI) ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ గారికి ముఖ్యమంత్రి గారు లేఖ రాశారు.అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా (ASDD) గుర్తించినట్లు ముఖ్యమంత్రి గారు ఈసీ గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు.మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి గారు లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడం లేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి గారు తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు.నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు.ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 172 ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. మండల స్థాయిలో సులభం గా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు.హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది ఓటర్ల నమోదు అధికారుల నియామకం సరిపోదని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.SIR ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో స్పష్టం చేశారు.

# ప్రాణహితకు పునరుజ్జీవం.. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల బ్యారేజీకి తెలంగాణ పట్టు

తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే తెలంగాణ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతల అవసరం లేకుండా సహజ గురుత్వాకర్షణ ద్వారా సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య జరగనున్న కీలక అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం సాయంత్రం ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబుతో పాటు నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఢిల్లీ సమావేశంలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన వాదనలు, 152 మీటర్ల బ్యారేజీ వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలను కూలంకషంగా సమీక్షించారు. రెండు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలకు కేంద్రం వేదిక కల్పించిన నేపథ్యంలో తెలంగాణ జల ప్రయోజనాలను బలమైన సాంకేతిక ఆధారాలతో ప్రతిపాదించేందుకు ఈ సన్నాహక సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.సెప్టెంబర్ 1న జరిగే అంతర్రాష్ట్ర సమావేశానికి కేంద్ర జల సంఘం (CWC) చైర్మన్ అధ్యక్షత వహిస్తారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల ఉన్నతాధికారులతో పాటు సీడబ్ల్యూసీలోని కీలక డైరెక్టరేట్ల అధిపతులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయని వెల్లడించారు.తెలంగాణ–మహారాష్ట్ర మధ్య అధికారిక చర్చల ప్రక్రియ ప్రారంభం కావడమే ప్రాణహిత పునరుజ్జీవనంలో ఒక కీలక ముందడుగని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ కేంద్రంతో నిరంతరం జరిపిన సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల ఫలితంగానే ఈ చర్చలకు మార్గం సుగమమైందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రైతాంగానికి మొదట ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గత రాష్ట్ర ప్రభుత్వం 2016లో అంగీకరించిన 148 మీటర్ల స్థాయికి బదులుగా 152 మీటర్ల స్థాయిలో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రెండు మీటర్ల అదనపు స్థాయి తెలంగాణకు జల వినియోగం, నీటి తరలింపు పరంగా గణనీయమైన సాంకేతిక ప్రయోజనాన్ని కల్పిస్తుందని వివరించారు.పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (CWPRS) నిర్వహించిన సాంకేతిక అధ్యయనాల ప్రకారం 148 మీటర్ల స్థాయిలో మహారాష్ట్ర భూభాగంలో సుమారు 1,150 ఎకరాలు, 152 మీటర్ల స్థాయిలో 2,500 ఎకరాలకు పైగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు."148 మీటర్ల వద్ద కూడా ముంపు ఉంది. 152 మీటర్ల వద్ద కూడా ముంపు ఉంటుంది. ముంపు అంశంపై మహారాష్ట్రతో సంప్రదింపులు అనివార్యమైనప్పుడు తెలంగాణకు సాంకేతికంగా అత్యధిక ప్రయోజనం కలిగించే 152 మీటర్ల స్థాయికి సమ్మతి సాధించేందుకు గత ప్రభుత్వం మరింత సమర్థంగా చర్చించి ఉండాల్సింది. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను తగినంతగా పరిరక్షించకుండా 148 మీటర్లకు అంగీకరించడం వల్ల తెలంగాణ ఒక కీలక అవకాశాన్ని కోల్పోయింది" అని మంత్రి పేర్కొన్నారు.తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణం సాధ్యమైతే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను సహజ గురుత్వాకర్షణతో సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఏర్పడుతుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. భారీ ఎత్తిపోతల వ్యవస్థల ద్వారా నీటిని తరలించేందుకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, ఏటా భరించాల్సిన నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. గురుత్వాకర్షణ ఆధారిత నీటి తరలింపు సాగునీటి వ్యవస్థను మరింత విశ్వసనీయంగా, ఆర్థికంగా సుస్థిరంగా మార్చగలదని పేర్కొన్నారు.ప్రాణహిత ప్రతిపాదనకు 1975, 1978 అంతర్రాష్ట్ర ఒప్పందాలు బలమైన న్యాయ, సంస్థాగత పునాదిగా ఉన్నాయని మంత్రి తెలిపారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలు ప్రాణహిత ప్రాజెక్టును పరస్పర ప్రయోజనాల కోసం సంయుక్తంగా లేదా స్వతంత్రంగా అభివృద్ధి చేసుకునేందుకు ఆ ఒప్పందాలు అవకాశం కల్పించాయని గుర్తుచే శారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రయత్నం కొత్తగా పుట్టుకొచ్చిన ఆలోచన కాదని, దశాబ్దాల క్రితం ఏర్పడిన అంతర్రాష్ట్ర అవగాహనకు అనుగుణంగా తెలంగాణ ప్రయోజనాలను సాధించే ప్రయత్నమని పేర్కొన్నారు. అసలు ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి పథకం సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూపుదిద్దుకుందని మంత్రి గుర్తుచేశారు. అనంతరం జరిగిన ప్రాజెక్టు పునరాకల్పన, పునర్వ్యవస్థీకరణలో అసలు ప్రతిపాదిత ఆయకట్టులోని గణనీయమైన ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలకు దూరమయ్యాయని తెలిపారు.ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని దాదాపు రెండు లక్షల ఎకరాలకు సమర్థమైన సాగునీటి వనరు లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ఏర్పడి దశాబ్దం దాటినా అసలు ప్రాణహిత–చేవెళ్ల పథకం ద్వారా నీరందుతుందని ఆశించిన రైతుల నిరీక్షణ కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు."అసలు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతుందని ఆశించిన రైతులు పదేళ్లకు పైగా ఎదురు చూశారు. వారికి జరిగిన సరిదిద్దేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. సెప్టెంబర్ 1న జరిగే సమావేశంలో 152 మీటర్ల ప్రతిపాదిత బ్యారేజీ స్థాయి, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తామని మంత్రి తెలిపారు. మహారాష్ట్రతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతూనే తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నదీజల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. "తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత. మహారాష్ట్రతో సుహృద్భావ వాతావరణంలో నిర్మాణాత్మక చర్చలు జరుపుతాం. గరిష్ఠ ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ, భారీ ఎత్తిపోతలపై ఆధారాన్ని తగ్గించి, రాష్ట్రంపై ఏటా పడే విద్యుత్ వ్యయభారాన్ని గణనీయంగా తగ్గించగల ప్రాణహిత ప్రాజెక్టును పునరుజ్జీవింపజేయడమే మా సంకల్పం. తెలంగాణ రైతాంగానికి ఒకప్పుడు ఇచ్చిన జలహామీని కార్యరూపంలోకి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన శనివారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓ.వి. రమేష్ బాబు తదితర ఉన్నతాధికారులతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే తెలంగాణ–మహారాష్ట్ర అంతర్రాష్ట్ర చర్చల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కామెంట్స్**
- **ప్రాణహితకు పునరుజ్జీవం.. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల బ్యారేజీకి తెలంగాణ పట్టు**
- **ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పునరుజ్జీవనానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు**
- **సెప్టెంబర్ 1న ఢిల్లీలో తెలంగాణ–మహారాష్ట్ర మధ్య కీలక అంతర్రాష్ట్ర చర్చలు**
- **కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య చర్చలు**
- **సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో తెలంగాణ–మహారాష్ట్ర అధికారుల కీలక సమావేశం**
- **ఢిల్లీ చర్చల్లో తెలంగాణ తరపున బలమైన సాంకేతిక, న్యాయపరమైన వాదనలు వినిపిస్తాం: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి కోరనున్న తెలంగాణ**
- **152 మీటర్ల స్థాయికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే తెలంగాణ ప్రధాన లక్ష్యం: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **2016లో గత ప్రభుత్వం అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్ల కోసం తెలంగాణ పట్టు**
- **152 మీటర్ల బ్యారేజీ సాధ్యమైతే సుందిళ్లకు గురుత్వాకర్షణతో దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాల తరలింపునకు అవకాశం**
- **గ్రావిటీ ద్వారా నీటి తరలింపుతో భారీ ఎత్తిపోతలపై ఆధారాన్ని తగ్గించవచ్చు: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **కోల్పోయాయి: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **రైతులకు అసలు ప్రాణహిత–చేవెళ్ల పథకంలో ఇచ్చిన జలహామీని తిరిగి నిలబెట్టడమే మా లక్ష్యం: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **మహారాష్ట్రతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతాం: మంత్రి**
- **తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నదీజల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు: ఉత్తమ్ కుమార్ రెడ్డి**
- **తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం ప్రజా ప్రభుత్వ బాధ్యత: కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com